వాస్తవాలు పలుకు DD9 వార్త
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక

## ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు







హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 61 | 14-07-2026 మంగళవారం | పేజీలు: 08 | వెల: 3/-

# పైసలు లేవంటూనే లక్షల కోట్ల ప్రాజెక్టులా?

ప్రభుత్వ ప్రాధాన్యతలపై హరీశ్‌రావు ధ్వజం
మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీపై భారీ వ్యయాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి
సంక్షేమానికి నిధులు లేవని చెప్పడం విరుద్ధమని విమర్శలు
ఫుట్‌బాల్ టోర్నీల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేయడం సమంజసం కాదన్న హరీశ్
అదే నిధులతో పాఠశాలలు, కళాశాలలు నిర్మించవచ్చని సూచన
రైతుబంధు పంపిణీని కూడా ప్రచార కార్యక్రమంగా మార్చేశారని విమర్శ
ఖమ్మం సభ కోసం వేల బస్సులు నడిపి భారీగా ఖర్చు చేశారన్న వ్యాఖ్యలు
ప్రజాధనాన్ని ప్రచార కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని ఆరోపణ
ఖజానా ఖాళీగా ఉందనే ప్రభుత్వ వాదనను ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత
సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డిమాండ్



హైదరాబాద్, (డిడి9 వార్త):
ప్రభుత్వం ఒకవైపు ఖజానాలో నిధులు లేవని చెబుతూనే మరోవైపు భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు చేపడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి డబ్బులు లేవని చెప్పే ప్రభుత్వం, లక్షల కోట్ల రూపాయలతో మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులను ఎలా చేపడుతోందని ప్రశ్నించారు.
ఫుట్‌బాల్ టోర్నీలు, ఇతర ప్రచార కార్యక్రమాల కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేయడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరైంది కాదన్నారు. ఆ నిధులతో అనేక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు నిర్మించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చని సూచించారు.
పక్క రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు ప్రభుత్వ నిధులతో పూర్తి పేజీ ప్రకటనలు ఇవ్వడం, రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలును కూడా భారీ ప్రచార కార్యక్రమాలుగా మార్చడం ప్రజాధన దుర్వినియోగమేనని హరీశ్‌రావు ఆరోపించారు. రైతుబంధు నిధుల పంపిణీ సందర్భంగా ఖమ్మంలో నిర్వహించిన సభ కోసం వేలాది బస్సులు ఏర్పాటు చేసి భారీగా మిగతా 2లో..

# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత తప్పనిసరి..

అస్సాంకు చెందిన 27 మందికి ఊరట కల్పించిన అత్యున్నత న్యాయస్థానం
విదేశీయులుగా ప్రకటించే ప్రక్రియ చట్టబద్ధంగా, న్యాయసమ్మతంగా ఉండాలని స్పష్టం
పౌరసత్వం రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కుల్లో ఒకటని వ్యాఖ్య
అక్రమంగా పౌరసత్వం పొందకుండా నిరోధించే అధికారం కేంద్ర ప్రభుత్వానిదేనని వెల్లడి
చిన్నపాటి స్పెల్లింగ్, టైపింగ్ తప్పిదాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవద్దని సూచన
గువాహటి హైకోర్టు, విదేశీయుల ట్రైబ్యునళ్ల తీర్పులను పక్కన పెట్టిన ధర్మాసనం
కేసులను మళ్లీ విచారించాలని ట్రైబ్యునళ్లకు ఆదేశాలు
పునర్విచారణ పూర్తయ్యే వరకు 27 మందిపై ఎలాంటి బలవంతపు చర్యలు వద్దని స్పష్టం
న్యాయపరమైన ప్రక్రియను ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచన
వ్యక్తిగత హక్కులు, దేశ భద్రత రెండింటి మధ్య సమతుల్యత అవసరమని వ్యాఖ్య



హైదరాబాద్, (డిడి9 వార్త):
పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియలో పూర్తి పారదర్శకత, న్యాయబద్ధత, సహజ న్యాయ సూత్రాలు తప్పనిసరిగా పాటించాలని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించడం అనేది అతని జీవితాన్ని పూర్తిగా ప్రభావితం చేసే అత్యంత తీవ్రమైన నిర్ణయమని పేర్కొన్న ధర్మాసనం, అలాంటి నిర్ణయాలు తీసుకునే సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. అస్సాంకు చెందిన 27 మంది పిటిషనర్లకు తాత్కాలిక రక్షణ కల్పిస్తూ ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది.
ఈ కేసును విచారించిన ధర్మాసనం పౌరసత్వం, విదేశీయుడనే హోదా సాధారణ పరిపాలనా అంశాలు కావని, అవి రాజ్యాంగపరంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలని వ్యాఖ్యానించింది. ఒక వ్యక్తి భారత పౌరుడా, కాదా అనే నిర్ణయం అతని ప్రాథమిక హక్కులు, జీవనోపాధి, ఓటు హక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కు, దేశంలో నివసించే హక్కు వంటి అనేక అంశాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని గుర్తు చేసింది. అందువల్ల అలాంటి నిర్ణయాలు చట్టబద్ధమైన ఆధారాలపైనే తీసుకోవాలని స్పష్టం చేసింది. అదే సమయంలో భారతదేశంలో అక్రమంగా పౌరసత్వం పొందే ప్రయత్నాలను అడ్డుకోవడం కేంద్ర ప్రభుత్వ బాధ్యతేనని సుప్రీంకోర్టు పేర్కొంది. దేశ భద్రత, సరిహద్దుల రక్షణ, చట్టవిరుద్ధ వలసలను నియంత్రించడం మిగతా 2లో..

V

## పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది

కేసీఆర్‌పై ఎంపీ చామల తీవ్ర విమర్శలు
కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
టికెట్ కోసం కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్‌దేనని విమర్శ
మంత్రి పదవి రాక టీడీపీని వీడారంటూ ఆరోపణ
బీఆర్ఎస్‌కు రక్తదాహం, ధనదాహం, అధికార దాహమంటూ విమర్శ
తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని స్పష్టం
విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాలకు కారణమయ్యారని ఆరోపణ
కమిషన్లే తప్ప రైతులకు నీళ్లు ఇవ్వలేదని మండిపాటు
బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని వ్యాఖ్య
ఈటల గెలుపులో బీఆర్ఎస్ పాత్ర ఉందని ఆరోపణ

హైదరాబాద్, (డిడి9 వార్త):
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. టికెట్ కోసం తన కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందంటూ ఎద్దేవా చేశారు. మంత్రి పదవి దక్కలేదనే మిగతా 2లో..



## బనకచర్లపై ఏపీకి వెంటనే నోటీసులు ఇవ్వలేం




సుప్రీంకోర్టు కీలక నిర్ణయం.. తెలంగాణ అభ్యర్థనకు నిరాకరణ
నిబంధనలకు విరుద్ధంగా పిటిషన్ లిస్ట్ అయిందని వ్యాఖ్య
ఒరిజినల్ సూట్ విధివిధానాలు పాటించాలని స్పష్టం
ముందుగా చాంబర్ జడ్జి ముందే పిటిషన్ దాఖలు చేయాలని సూచన
రిజిస్ట్రీ నిబంధనలను ప్రస్తావించిన జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం
ప్రక్రియ పూర్తికాకముందే బెంచ్ ముందుకు రావడంపై అభ్యంతరం
ప్రతివాదులకు నోటీసులు జారీ చేసే దశ ఇంకా రాలేదన్న కోర్టు
తెలంగాణ ప్రభుత్వ వాదనను ఈ దశలో స్వీకరించని సుప్రీంకోర్టు
నిబంధనల ప్రకారమే తదుపరి విచారణ ఉంటుందని స్పష్టం
బనకచర్ల వివాదంలో కీలక పరిణామం

## సింగరేణిని బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకున్నాయి

నైనీ కోల్‌బ్లాక్ ఇచ్చిన మోదీకి కృతజ్ఞతలు: కిషన్‌రెడ్డి
కొత్తగూడెంలో బీజేపీ సింగరేణి భరోసా యాత్రలో కేంద్రమంత్రి ప్రసంగం
వేలం లేకుండా తాడిచర్ల-2 బ్లాక్ కేటాయింపు చారిత్రక నిర్ణయమని వ్యాఖ్య
సింగరేణికి అండగా నిలిచిందే మోదీ ప్రభుత్వమని వెల్లడి
అక్రమంగా కేటాయించిన గనులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని వ్యాఖ్య
కార్మికుల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని మండిపాటు
మెస్సీతో ఫుట్‌బాల్ కోసం సింగరేణి డబ్బులు ఖర్చు చేస్తారా? అంటూ ప్రశ్న
సింగరేణిని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని కేసీఆర్‌పై విమర్శలు
సింగరేణి వ్యవహారాల్లో కేంద్రానికి పెత్తనం ఉండదని స్పష్టం



హైదరాబాద్, (డిడి9 వార్త):
ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిన ప్రధాని నరేంద్ర మోదీకి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మిగతా 2లో..

## రామాలయ విరాళాల చోరీపై సిట్ నివేదిక ఇవ్వాలి

కేంద్రం, యూపీకి సుప్రీంకోర్టు నోటీసులు
అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసుపై సుప్రీంకోర్టులో విచారణ
దర్యాప్తు పురోగతిపై పూర్తి నివేదిక సమర్పించాలని సిట్‌కు ఆదేశం
కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, ట్రస్టుకు నోటీసులు జారీ
సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ ప్రారంభం
సిట్ సభ్యుల వివరాలు కూడా నివేదికలో పొందుపరచాలని ఆదేశం
స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో సమర్పిస్తామని యూపీ ప్రభుత్వం వెల్లడి
ఆ నివేదికను పిటిషనర్లకు ఇవ్వడంపై కోర్టులో వాదోపవాదాలు
పిటిషనర్లకు చట్టబద్ధంగా నివేదిక అందుతుందని స్పష్టం చేసిన ధర్మాసనం
దర్యాప్తులో పర్యవేక్షణ లోపాలు వెలుగులోకి వచ్చినట్లు వెల్లడి
తదుపరి విచారణ జులై 20కి వాయిదా



హైదరాబాద్, (డిడి9 వార్త):
అయోధ్యలోని రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కేసు దర్యాప్తు చేపడుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇప్పటివరకు చేసిన విచారణకు సంబంధించిన సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించింది. అలాగే దర్యాప్తు బృందంలో ఉన్న సభ్యుల వివరాలు, వారి బాధ్యతలు కూడా నివేదికలో పొందుపరచాలని మిగతా 2లో..

## తెలంగాణ క్రికెట్‌కు టీజీ20 కొత్త ఊపు

విజేతలకు భట్టి విక్రమార్క అభినందనలు
టీజీ20 సీజన్-1 విజయవంతంగా ముగియడంపై హర్షం
నిర్వాహకులు, స్పాన్సర్ల కృషిని కొనియాడిన ఉప ముఖ్యమంత్రి
ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో పోటీపడ్డారని ప్రశంస
గ్రామీణ యువతకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని వ్యాఖ్య
హైదరాబాద్ ఈ-చాంపియన్స్ జట్టుకు అభినందనలు
ఖమ్మం ఏసెస్ జట్టు పోరాట పటిమ ప్రశంసనీయం
రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి టీజీ20 దోహదపడుతుందని ఆశాభావం



హైదరాబాద్, (డిడి9 వార్త):
తెలంగాణలో క్రికెట్‌కు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చిన టీజీ20 సీజన్1 విజయవంతంగా ముగియడం ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని మరింత బలోపేతం చేసే దిశగా ఇలాంటి టోర్నీలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.టోర్నీని విజయవంతంగా నిర్వహించిన మిగతా 2లో..

## పైసలు లేవంటూనే లక్షల కోట్ల ప్రాజెక్టులా?

**మొదటిపేజీ తరువాయి**

ఖర్చు చేశారని, అది కూడా ప్రభుత్వ ధనమే నని వ్యాఖ్యానించారు.
ఇలాంటి కార్యక్రమాలకు కోట్ల రూపాయలు వెచ్చిస్తున్న ప్రభుత్వం, రైతులకు, ఉద్యోగులకు, సంక్షేమ పథకాలకు మాత్రం నిధులు లేవని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజా ధన వినియోగంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని, ఖజానాలో నిజంగా నిధుల కొరత ఉంటే భారీ ప్రాజెక్టులు, ప్రచార కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్న డబ్బు ఎక్కడి



నుంచి వస్తోందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ క్రికెట్‌కు టీజీ20 కొత్త ఊపు

**మొదటిపేజీ తరువాయి**

నిర్వాహకులకు, సహకరించిన స్పాన్సర్లకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న అన్ని జట్ల ఆటగాళ్లు, కోచ్‌లు, సపోర్టింగ్ స్టాఫ్ క్రీడా స్ఫూర్తితో వ్యవహరించి టోర్నీ విజయానికి తోడ్పడ్డారని కొనియాడారు.
గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న యువ ప్రతిభను గుర్తించి వారికి తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని కల్పించడంలో ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో క్రికెట్‌తో పాటు అన్ని క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, యువ క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. టీజీ20 సీజన్1 ఫైనల్‌లో ఉత్కంఠభరిత పోరులో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈచాంపియన్స్ జట్టుకు భట్టి విక్రమార్క ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన ఖమ్మం ఏసెస్ జట్టు కూడా చివరి వరకు అద్భుతమైన పోరాట పటిమ కనబరిచిందని ప్రశంసించారు. విజేతలు, రన్నరప్ జట్లతో పాటు టోర్నీలో పాల్గొన్న అన్ని జట్లకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.
రాష్ట్రంలో ఇలాంటి క్రీడా పోటీలు మరిన్ని నిర్వహించడం ద్వారా యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెరగడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులు తెలంగాణ నుంచి మరింతగా ఎదిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది

**మొదటిపేజీ తరువాయి**

కారణంతోనే కేసీఆర్ తెలుగుదేశం పార్టీని వీడి బయటకు వచ్చారని ఆరోపించారు.
పార్టీ స్థాపించిన తర్వాత తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుని ఎన్నికలు, కలెక్షన్లు చేశారని చామల విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీకి రక్తదాహం, ధనదాహం, అధికార దాహం తప్ప ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను తిరస్కరించి ఇంటికే పరిమితం చేశారని వ్యాఖ్యానించారు.
తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులను రెచ్చగొట్టి, వారి బలిదానాలకు బీఆర్ఎస్ కారణమైందని ఆరోపించారు. పిట్టకథలు చెప్పి ప్రజలను నమ్మించి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని విమర్శించారు.
అధికారంలో ఉన్న పదేళ్లలో కమిషన్లు దండుకోవడం తప్ప రైతులకు సాగునీరు అందించేలా ఒక్క ఎకరానికైనా కొత్తగా నీళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. *"పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది"* అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సెటైర్లు విసిరారు. 2009లోనే కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చారని, అంతకుముందు ఉద్యమంలో ఆయన పాత్ర పెద్దగా కనిపించలేదని చామల వ్యాఖ్యానించారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను కేసీఆర్ ఎప్పుడూ పట్టించుకోలేదని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించడంలో బీఆర్ఎస్ పరోక్షంగా సహకరించిందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీల రాజకీయాలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన తీర్పు ఇస్తారని ఆయన పేర్కొన్నారు.



## బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా ససానే సిద్ధార్థ్ నియామకం

- **నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన సిద్ధార్థ్**

**డిడి9 వార్త గుడిహత్నూర్:**

ఆదిలాబాద్ జిల్లా బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన ససానే సిద్ధార్థ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్, ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్లకు ససానే సిద్ధార్థ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, దళితుల సంక్షేమం, పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేస్తానని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు జిల్లా వ్యాప్తంగా దళిత మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వెంకట స్వామి రమేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు



# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత తప్పనిసరి..

**మొదటిపేజీ తరువాయి**

వంటి అంశాల్లో కేంద్రానికి రాజ్యాంగబద్ధమైన అధికారాలు ఉన్నాయని తెలిపింది. అయితే ఆ అధికారాలను వినియోగించే సమయంలో న్యాయపరమైన విధానాలను విస్మరించరాదని, ప్రతి వ్యక్తికి తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించాల్సిందేనని స్పష్టం చేసింది.
ఈ కేసు అస్సాంలో విదేశీయుల గుర్తింపు ప్రక్రియకు సంబంధించినది. పిటిషన్ దాఖలు చేసిన 27 మంది తమ కుటుంబ సభ్యులు ఎన్నో ఏళ్లుగా భారతదేశంలో నివసిస్తున్నారని, తమ పేర్లు పాత ఓటర్ల జాబితాల్లో నమోదై ఉన్నాయని పేర్కొన్నారు. అయితే పాత ఓటర్ల జాబితాల్లో వారి పేర్ల స్పెల్లింగ్‌లో ఉన్న చిన్నచిన్న వ్యత్యాసాలు, టైపింగ్ తప్పిదాలు, భాషా మార్పుల కారణంగా వచ్చిన అక్షర దోషాలను ఆధారంగా తీసుకుని సంబంధిత విదేశీయుల ట్రైబ్యునళ్లు తమను విదేశీయులుగా ప్రకటించాయని వారు సుప్రీంకోర్టుకు వివరించారు.
పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదిస్తూ.. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల పేర్లు వేర్వేరు కాలాల్లో వేర్వేరు విధాలుగా నమోదు కావడం అసాధారణం కాదన్నారు. ముఖ్యంగా ఇంగ్లిష్, అస్సామీ, బెంగాలీ వంటి భాషల మధ్య పేర్ల అనువాదంలో, స్పెల్లింగ్‌లో మార్పులు సహజమని తెలిపారు. ఇలాంటి చిన్నపాటి పొరపాట్లను ఆధారంగా తీసుకుని వ్యక్తులను విదేశీయులుగా ప్రకటించడం న్యాయసమ్మతం కాదని వాదించారు.
ఈ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు కూడా పత్రాల్లో ఉన్న చిన్నచిన్న స్పెల్లింగ్ లేదా టైపింగ్ లోపాలను మాత్రమే ఆధారంగా తీసుకుని ఒక వ్యక్తి పౌరసత్వంపై తుది నిర్ణయానికి రావడం సరైన విధానం కాదని అభిప్రాయపడింది. ప్రతి కేసును అందుబాటులో ఉన్న అన్ని ఆధారాలు, కుటుంబ సంబంధాలు, పాత ప్రభుత్వ రికార్డులు, స్థానిక పరిస్థితులు, ఇతర ధ్రువపత్రాల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాలని సూచించింది. ఈ సందర్భంగా గువాహటి హైకోర్టు, విదేశీయుల ట్రైబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అయితే పిటిషనర్లు సమర్పించిన పౌరసత్వ ఆధారాలను తాము ఈ దశలో పూర్తిగా పరిశీలించడం లేదని కూడా స్పష్టం చేసింది. పౌరసత్వంపై తుది నిర్ణయం తీసుకోవడం ట్రైబ్యునళ్ల బాధ్యతేనని పేర్కొంటూ, కేసులను మళ్లీ విచారించాలని ఆదేశించింది.
పునర్విచారణ సందర్భంగా పిటిషనర్లు సమర్పించే అన్ని పత్రాలు, కుటుంబ వంశవృక్షం, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులు, ఇతర ప్రభుత్వ ధ్రువపత్రాలను సమగ్రంగా పరిశీలించాలని ట్రైబ్యునళ్లకు సూచించింది. ప్రతి వ్యక్తికి తన వాదనను



పూర్తి స్థాయిలో వినిపించుకునే అవకాశం ఇవ్వాలని, సహజ న్యాయసూత్రాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించింది. మరోవైపు, పునర్విచారణ పూర్తయ్యే వరకు ఆ 27 మంది పిటిషనర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వారిని నిర్బంధించడం, దేశం విడిచి వెళ్లాలని ఒత్తిడి చేయడం లేదా ఇతర పరిపాలనా చర్యలు చేపట్టరాదని తెలిపింది. దీంతో వారికి తాత్కాలిక రక్షణ లభించింది.
అస్సాంలో అక్రమ వలసదారుల గుర్తింపు అంశం దశాబ్దాలుగా అత్యంత సున్నితమైన అంశంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విదేశీయుల ట్రైబ్యునళ్ల తీర్పులు, జాతీయ పౌరుల నమోదుపత్రం (ఎన్‌ఆర్‌సీ) ప్రక్రియ, పౌరసత్వ వివాదాలకు సంబంధించిన కేసులు తరచుగా న్యాయస్థానాల ముందుకు వస్తున్నాయి. ఈ తాజా తీర్పు కూడా అలాంటి కేసుల్లో న్యాయపరమైన ప్రక్రియ ఎంత ముఖ్యమో మరోసారి స్పష్టం చేసింది. మొత్తంగా చూస్తే, ఒకవైపు దేశ భద్రతను కాపాడుతూ అక్రమ వలసలను అరికట్టడం ప్రభుత్వ బాధ్యత అని, మరోవైపు నిజమైన భారత పౌరులు అన్యాయానికి గురికాకుండా చట్టబద్ధమైన, పారదర్శకమైన, నిష్పాక్షికమైన విచారణ జరగాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉందని సుప్రీంకోర్టు ఈ తీర్పు ద్వారా స్పష్టం చేసింది. వ్యక్తిగత హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ, దేశ ప్రయోజనాలు.. ఈ మూడింటి మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరాన్ని ధర్మాసనం తన వ్యాఖ్యల ద్వారా మరోసారి నొక్కి చెప్పింది.

## సింగరేణిని బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకున్నాయి

**మొదటిపేజీ తరువాయి**

సింగరేణి భరోసా యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సింగరేణి సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు సంస్థకు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు దేశంలో బొగ్గు గనులను ప్రధానంగా వేలం ద్వారానే కేటాయిస్తూ వచ్చారని కిషన్‌రెడ్డి తెలిపారు. అయితే సింగరేణి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాని మోదీ ప్రత్యేక చొరవతో వేలం లేకుండా తాడిచర్ల2 కోల్‌బ్లాక్‌ను కేటాయించారని చెప్పారు. అలాగే ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్‌ను కూడా సింగరేణికి ఇవ్వడం కేంద్ర ప్రభుత్వం సంస్థ పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.
సింగరేణి ప్రస్తుత పరిస్థితికి బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణమని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రెండు పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో సంస్థను అభివృద్ధి చేయకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని విమర్శించారు. గతంలో డబ్బులు తీసుకుని బొగ్గు గనులు కేటాయించారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ హయాంలో అక్రమంగా కేటాయించిన గనులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. బొగ్గు గనుల కేటాయింపులో పూర్తి పారదర్శకత ఉండాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు.
సింగరేణి కార్మికుల కష్టార్జిత సంపదను పాలకులు దోచుకుంటున్నారని ఆయన మండిపడ్డారు. సంస్థలో బొగ్గు నిల్వలు తగ్గిపోయాయని చెబుతూ కేటీఆర్, హరీశ్‌రావు కేంద్రానికి లేఖలు రాశారని, కానీ సింగరేణి వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఏమిటో వారికి తెలియదా అని ప్రశ్నించారు.
సింగరేణి అంశంలో కేంద్రం తలదూర్చదని మీకు తెలియదా? మెస్సీతో ఫుట్‌బాల్



ఆడేందుకు సింగరేణి డబ్బు ఖర్చు చేస్తారా? ప్రజల సొమ్మును ఇలాంటి కార్యక్రమాలకు వెచ్చించడం సమంజసమేనా? అంటూ కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. సింగరేణిని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేశారని, సంస్థ నిధులను ప్రజా ప్రయోజనాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగించారని ఆరోపించారు.
పదేళ్లపాటు కేసీఆర్ సింగరేణిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని కిషన్‌రెడ్డి విమర్శించారు. సంస్థ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్ సింగరేణికి దక్కినప్పుడు మాత్రం కేసీఆర్ స్పందించలేదని వ్యాఖ్యానించారు. సింగరేణిలో ఏ సమస్య వచ్చినా కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండా రాజకీయ విమర్శలు చేయడం సరైంది కాదని కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణి సంస్థపై కేంద్రానికి ప్రత్యక్ష పెత్తనం ఉండదని, సంస్థ పరిపాలన రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతోనే సాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

## బనకచర్లపై ఏపీకి వెంటనే నోటీసులు ఇవ్వలేం

- **సుప్రీంకోర్టు కీలక నిర్ణయం.. తెలంగాణ అభ్యర్థనకు నిరాకరణ**
- **నిబంధనలకు విరుద్ధంగా పిటిషన్ లిస్ట్ అయిందని వ్యాఖ్య**
- **ఒరిజినల్ సూట్ విధివిధానాలు పాటించాలని స్పష్టం**
- **ముందుగా చాంబర్ జడ్జి ముందే పిటిషన్ దాఖలు చేయాలని సూచన**
- **రిజిస్ట్రీ నిబంధనలను ప్రస్తావించిన జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం**
- **ప్రక్రియ పూర్తికాకముందే బెంచ్ ముందుకు రావడంపై అభ్యంతరం**
- **ప్రతివాదులకు నోటీసులు జారీ చేసే దశ ఇంకా రాలేదన్న కోర్టు**
- **తెలంగాణ ప్రభుత్వ వాదనను ఈ దశలో స్వీకరించని సుప్రీంకోర్టు**
- **నిబంధనల ప్రకారమే తదుపరి విచారణ ఉంటుందని స్పష్టం**
- **బనకచర్ల వివాదంలో కీలక పరిణామం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఒరిజినల్ సూట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వెంటనే నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం, కేసు విచారణ నిబంధనలకు అనుగుణంగా జరగాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా బెంచ్ ముందుకు లిస్ట్ అయిందని ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం



చేసింది. ఒరిజినల్ సూట్‌కు సంబంధించిన పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టు రిజిస్ట్రీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. అలాంటి కేసులు నేరుగా బెంచ్ ముందు విచారణకు రాకూడదని, ముందుగా నిర్దేశిత విధానాన్ని అనుసరించాలని స్పష్టం చేసింది.
రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా చాంబర్ జడ్జి పరిశీలనకు సమర్పించాల్సి ఉంటుందని ధర్మాసనం వెల్లడించింది. చాంబర్ జడ్జి అనుమతి, ప్రాథమిక పరిశీలన పూర్తైన తర్వాతే తదుపరి న్యాయపరమైన ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొంది. ఆ దశ పూర్తికాకముందే ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని కోరడం సముచితం కాదని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనను కూడా సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ముందుగా ఒరిజినల్ సూట్‌కు సంబంధించిన అన్ని విధివిధానాలు పూర్తికావాల్సి ఉంటుందని, అనంతరమే కేసు తదుపరి దశకు వెళ్తుందని స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎలాంటి నోటీసులు జారీ కాలేదు. నిబంధనల ప్రకారం పిటిషన్ ప్రక్రియ పూర్తైన తర్వాతే ఈ వ్యవహారంలో తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన ఈ న్యాయ వివాదంలో సుప్రీంకోర్టు తాజా నిర్ణయం కీలక పరిణామంగా భావిస్తున్నారు.

# రామాలయ విరాళాల చోరీపై సిట్ నివేదిక ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

స్పష్టం చేసింది. ఈ కేసులో సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పలు పిటిషన్లను విచారణకు స్వీకరించిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, అలాగే ఆలయ నిర్వహణను పర్యవేక్షిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు నోటీసులు జారీ చేసింది.
ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో జరిగినట్లు ఆరోపణలు ప్రజల్లో ఆందోళనకు కారణమయ్యాయని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు ఎంతవరకు పురోగమించిందో తెలియజేయాలని ధర్మాసనం ఆదేశించింది. దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందా? ఇందులో భాగమైన అధికారులు ఎవరెవరు? వంటి వివరాలను కూడా నివేదికలో పొందుపరచాలని పేర్కొంది.
ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, దర్యాప్తు కొనసాగుతోందని, స్టేటస్ రిపోర్ట్‌ను సీల్డ్ కవర్‌లో కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. దర్యాప్తు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నివేదికను బహిరంగంగా వెల్లడించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఆ నివేదిక ప్రతిని తమకు కూడా అందించాలని కోరారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన మెహతాకు ధర్మాసనం స్పందిస్తూ, *"మీకు చట్టం తెలుసు. ఎలాగైనా వారు ఆ రిపోర్ట్‌ను చూస్తారు"* అని వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను జులై 20వ తేదీకి వాయిదా వేసింది.
అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. సిట్ ప్రాథమిక విచారణలో విరాళాల లెక్కింపు ప్రక్రియలో పలు భద్రతా లోపాలు, పర్యవేక్షణలో తీవ్రమైన వైఫల్యాలు ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడైంది. విరాళాల లెక్కింపు సమయంలో అమలు కావాల్సిన నియంత్రణ వ్యవస్థలు సరిగా పనిచేయలేదని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. ఈ కేసులో ఇప్పటివరకు పలువురు నిందితులను అరెస్టు చేశారు. దర్యాప్తు సందర్భంగా నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు విరాళాల నిర్వహణలో పనిచేసిన కొందరు ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది పాత్రపై కూడా అధికారులు దృష్టి సారించారు. ప్రాథ



మిక నివేదికలో పలు సందర్భాల్లో విరాళాల లెక్కింపులో అక్రమాలు జరిగినట్లు సిట్ గుర్తించినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా చేయగా, ట్రస్టులో పరిపాలనా మార్పులు చేపట్టారు. ఆలయ నిర్వహణలో మరింత పారదర్శకత తీసుకురావడంతో పాటు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు ప్రారంభించారు.
అయితే తనపై వస్తున్న ఆరోపణలను చంపత్ రాయ్ ఖండించారు. సిట్ తుది నివేదిక వెలువడిన తర్వాత అన్ని ఆరోపణలకు ఒక్కో అంశంపై సమాధానం ఇస్తానని తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన అయోధ్య రామాలయంలో విరాళాల నిర్వహణపై అవినీతి ఆరోపణలు రావడం తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని దర్యాప్తు పురోగతిపై పూర్తి నివేదిక కోరడం, కేంద్రం, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం, ట్రస్టుకు నోటీసులు జారీ చేయడం ఈ కేసులో కీలక పరిణామంగా మారింది. జులై 20న జరిగే తదుపరి విచారణలో సిట్ సమర్పించే నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు దిశపై మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉంది.

# నులిపురుగుల నివారణే.. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు సోపానం

- **నిజామాబాద్‌లో ఘనంగా జాతీయ పురుగుల నివారణ దినోత్సవం**

**నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

జాతీయ పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా అర్సపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వుడ్‌బ్రిడ్జి ప్రైవేటు పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి .రాజశ్రీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యార్థుల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు వ్యక్తిగత పరిశుభ్రత అత్యవసరమని స్పష్టం చేశారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో శారీరక మానసిక వికాసం కుంటుపడటంతో పాటు రక్తహీనత, అలసట, డయేరియా, డీసెంట్రి వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు బాల బాలికలందరూ ఏడాదికి రెండుసార్లు ఆరు నెలల వ్యవధిలో ఈ మాత్రలను తీసుకోవాలని సూచించారు. మాత్రల పంపిణీతో పాటు నిత్య జీవితంలో మార్పులు చేసుకోవాలని ముఖ్యంగా వారానికోసారి గోళ్లు కత్తిరించుకోవడం, మరుగుదొడ్ల వినియోగం, పండ్లు, కూరగాయలను శుభ్రం చేసి తినడం, భోజనానికి ముందు.. మల విసర్జన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం వంటి అలవాట్లు పాటించాలని పిలుపునిచ్చారు. ఈరోజు మాత్రలు వేసుకోని విద్యార్థులు జులై 20న నిర్వహించే 'మొప్అప్ డే' రోజున తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అజ్మతునిస, వెంకటేష్, ఏఎన్ఎంలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






# ముఖ్యమంత్రి నివాసం వద్ద ఆప్ ఆందోళన

**నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, బోధన్‌లోని పాఠశాలలో ఉర్దూను ప్రథమ భాషగా అనుమతించాలనే డిమాండ్లతో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసం వద్ద ఉద్రిక్తతకు దారితీసింది. నిజామాబాద్ జిల్లా ఆప్ అధ్యక్షుడు సమీర్ అహ్మద్ నాయకత్వంలో బోధన్, రూరల్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు జునైద్ అహ్మద్, జుబేర్ అహ్మద్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించారు. ఈ సందర్భంగా సమీర్ అహ్మద్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, ఉచిత విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత అని, శిథిలావస్థకు చేరిన భవనాలను ఆధునీకరించి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల కొరతను తీర్చడంతో పాటు విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. బోధన్‌లోని శక్కర్‌నగర్ ప్రభుత్వ మధు మాలంచ హైస్కూల్‌లో ఉర్దూను ప్రథమ భాషగా ఎంచుకునే మైనారిటీ విద్యార్థులకు అడ్మిషన్లు నిరాకరించడం అన్యాయమని, దశాబ్దాలుగా ఉన్న విద్యా విధానాన్ని కొనసాగిస్తూ వెంటనే అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టాలని, ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని ఆయన స్పష్టం చేశారు. నిరసనకారులు విద్య ప్రతి విద్యార్థి హక్కు అంటూ నినాదాలు చేస్తూ బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్ వాహనాల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను సంక్షోభం నుంచి రక్షించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆప్ నాయకులు హెచ్చరించారు.



# నూతన మీ సేవ కేంద్రం ప్రారంభం

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డిడి 9 వార్త) జులై 13**

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం జరి గ్రామంలో నూతన మీసేవ కేంద్రం ప్రారంభించినట్లు గ్రామ సర్పంచ్ మేస్త్రం రూప కాశిరాం తెలిపారు గ్రామాలలో ప్రభుత్వ సేవలు పొందెందుకు ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు ఆదాయ కుల సర్టిఫికెట్స్ రేషన్ కార్డు పెన్షన్ వివిధ ప్రభుత్వ దురకస్తులు ఏవైనా ఇకనుండి గ్రామంలోనే అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు మారుమూల గిరిజన గ్రామమైన జరిలో మీసేవ కేంద్రం ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు గ్రామస్తులు మరియు యువకులు పాల్గొన్నారు

# హసకొత్తూరులో నులిపురుగుల నివారణ దినోత్సవం

**నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని హసకొత్తూరు గ్రామంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ నలిమెల రేవతి గంగారెడ్డి ప్రారంభించి, రెండు నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులకు మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు, నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఏనుగు మనోహర్, ఏఎన్ఎంలు సుజాత, మమత, ఆశా కార్యకర్తలు, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బంగ్లా లింబాద్రి, ఉపాధ్యక్షులు రాధారావు, గంగాధర్, కుందేటి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు అరుణశ్రీ, వేణుగోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.






# భీంగల్‌లో వైభవంగా 'ఊర' పండుగ

**నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

భీంగల్ పట్టణంలో సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన 'ఊర పండుగ' కన్నుల పండువగా సాగింది. భూలక్ష్మి, మైసమ్మ ఆలయంలో జరిగిన ఈ వేడుకకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సంప్రదాయాలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇటువంటి వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. భక్తుల కోలాహలం, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత: ఆర్డీవో విజయకుమారి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. బోధన్ ఆర్డీవో విజయకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు హాజరయ్యారు.

ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆర్డీవో విజయకుమారి స్వయంగా స్వీకరించారు. మొత్తం 8 దరఖాస్తులు అందగా వాటిపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా కుటుంబ భూ వివాదాలు, పట్టణంలో తాగునీటి వృథా, డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదులు అందాయి. వీటితో పాటు ఇల్లు మ్యుటేషన్ కోసం రెండు, పాస్‌బుక్ సమస్యల పరిష్కారం కోసం రెండు, అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం ఒక దరఖాస్తును బాధితులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో విజయకుమారి మాట్లాడుతూ.. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో రాజీ పడేది లేదని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు తమ ఫిర్యాదులను నిర్భయంగా ప్రజావాణి వేదికపైకి తీసుకురావాలని సూచించారు.

# క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తాం

- **సీపీ అంబర్ కిశోర్ ఝా**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 13 (డీడీ9 వార్త):**

5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ -2026 క్లస్టర్-ఏ పోటీల్లో కాళేశ్వరం జోన్ 48 పతకాలు సాధించడం గర్వకారణమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సోమవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పతక విజేతలను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...., క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు సమన్వయం, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే పోలీస్ సిబ్బందికి శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. క్లస్టర్-ఏ పోటీల్లో కాళేశ్వరం జోన్‌కు చెందిన 51 మంది పాల్గొనగా, 31 మంది క్రీడాకారులు 8 బంగారు, 16 వెండి, 24 కాంస్య పతకాలతో మొత్తం 48 పతకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీలు, ఆర్ఐలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.






# బీసీఐ WWF కేశవపూర్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( డిడి 9 వార్త) జులై 13**

తలమడుగు మండలం జరి గ్రామంలో బి సి ఐ కేశవపూర్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఫీల్డ్ విజిట్ లో భాగంగా రైతులకు వ్యవసాయ సందేహాలపై పలు సూచనలు చేసినట్లు సంస్థ క్షేత్ర సహాయకుడు కడదారపు స్వామి తెలిపారు

రైతులు పండించే పంటలు సోయా కంది పత్తి మొదలైన వాటి గురించి వివరిస్తూ రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులు వాడడం వల్ల భూమి సారవంతం పెరిగి అధిక దిగుబడి పొందవచ్చు అన్నారు రైతులు మట్టి పరీక్షలు చేయించుకొని వాటి ఆధారంగా ఎరువులు వాడడం వలన లాభాలు వస్తాయని ముఖ్యంగా ప్రధాన పంట అయినటువంటి పత్తిలో వాతావరణ మార్పుల వల్ల వచ్చే చీడపీడల గురించి వివరిస్తూ అలాగే రైతులు పురుగుల మందు పిచికారి చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు అలాగే గ్రామంలో బాల కార్మికులు ఉండకూడదు అని జరి గ్రామానికి చెందిన రాహుల్ అనే పిల్లవాడు బడికి వెళ్ళకుండా ఉండడానికి గమనించి వారి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి పిల్లవాని తల్లిదండ్రులకు అవగాహన కల్పించి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లి సదరు పిల్లవాణ్ణి బడిలో చేరిపించడం జరిగిందని వారు తెలిపారు పిల్లవాణ్ణి బడిలో చేర్పించడం పట్ల తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు






# ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **సీపీ పి.సాయిచైతన్య**

**నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి సీపీ పి.సాయిచైతన్య స్వయంగా 39 అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను సీపీకి విన్నవించుకోగా వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన వెంటనే సంబంధిత స్టేషన్ల ఎస్ఐలు, సీఐలకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదును చట్టప్రకారం విచారించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... పోలీసులు ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. "ప్రజలు ఎటువంటి పైరవీలు, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు. నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలి. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజల సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి ద్వారా ఫిర్యాదులను స్వీకరిస్తూ వాటిని తక్షణమే పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్యానికి అల్బెండజోల్ రక్షణ

**నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

జిల్లాలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ మహాత్మ జ్యోతిబాపూలే హైస్కూల్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ భుజంగరావు పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకటి నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులందరి శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ మాత్రలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. నులిపురుగులు, కొంకిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, అలసట, కడుపు నొప్పి, డయేరియా వంటి సమస్యలు తలెత్తుతాయని వీటిని నివారించేందుకు విద్యార్థులు మాత్రలను నమిలి మింగాలని సూచించారు. భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవడం వంటి అలవాట్లు ఆరోగ్యానికి పునాదులని ఆయన పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,90,297 మంది విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్నామని వివరించారు. ముఖ్యంగా బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు ఐరన్, క్యాల్షియం, ప్రోటీన్ అధికంగా ఉండే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చేతి వేళ్ల గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈరోజు మాత్రలు వేసుకోని విద్యార్థులు జులై 20న నిర్వహించే మొప్అప్ డే రోజున తప్పనిసరిగా తీసుకోవాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ అశోక్, రీజనల్ కోఆర్డినేటర్ సత్యనాథ రెడ్డి, డీఈవో అశోక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రిన్సిపాల్ స్వప్న, వివిధ విభాగాల అధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఎన్యుమరేషన్ ఫార్మ్‌ల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి: ఆర్డీవో

- **నవీపేట్, రెంజల్ మండలాల్లో ఆకస్మిక తనిఖీలు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

ఎస్ఐఆర్ 2026 ప్రక్రియలో భాగంగా జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫార్మ్‌ల డిజిటైజేషన్ ప్రక్రియను ఆర్డీవో విజయకుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఆమె నవీపేట్, రెంజల్ మండలాల్లోని పలు వార్డులను సందర్శించి పనులను సమీక్షించారు. నవీపేట్ మండల కేంద్రం, నవీపేట్ తండా, అభంగపట్నం గ్రామాల్లోని బీఎల్‌ఓలను కలిసి, డిజిటైజేషన్ జరుగుతున్న తీరును ఆర్డీవో పరిశీలించారు. అనంతరం రెంజల్ మండలంలోని కూనేపల్లి, సాట్టాపూర్ కేంద్రాలను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత కీలకమైనదని, క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

# పెండింగ్ ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- **ఆర్డీవోకు పీడీఎస్ఎఫ్ వినతి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాలుగా విద్యార్థులకు చెల్లించాల్సిన రూ. 11,500 కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఫ్రంట్ డిమాండ్ చేసింది. సోమవారం బోధన్ ఆర్డీవో విజయకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎన్. బాల్‌రాజ్ మాట్లాడుతూ.. పెండింగ్ నిధుల వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించలేక అనేకమంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో సర్టిఫికెట్లు పొందలేక విద్యార్థులు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు ఏళ్ల తరబడి బకాయిలు రాకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు కూడా ఇబ్బందుల్లో ఉన్నాయని చెప్పారు. దేశ భవిష్యత్తు విద్యారంగంపైనే ఆధారపడి ఉందని, అభివృద్ధిని కాంక్షించే ప్రభుత్వాలు విద్యార్థుల భవితను దృష్టిలో ఉంచుకుని తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఎఫ్ డివిజన్ నాయకులు శేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ తనిఖీలు చేపట్టాలి

- **అగ్నిమాపక అధికారికి వినతి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

బోధన్ డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ మరియు డిగ్రీ కళాశాలల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై తక్షణమే తనిఖీలు నిర్వహించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం బోధన్ అగ్నిమాపక అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలే నాగేష్ మాట్లాడుతూ... డివిజన్‌లోని అనేక విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పూర్తిగా అమలు కావడం లేదని, దీనివల్ల విద్యార్థుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా అగ్నిమాపక శాఖ ప్రత్యేక దృష్టి సారించి, అన్ని విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా చెల్లుబాటు అయ్యే ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా అని పరిశీలించడంతో పాటు, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, అలారం వ్యవస్థలు వంటి అత్యవసర భద్రతా ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని విన్నవించారు. భద్రతా నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భద్రత కోసం అవసరమైన సూచనలు జారీ చేసి వాటి అమలును పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీవీపీ డివిజన్ కార్యదర్శి నిఖిల్, పట్టణ కార్యదర్శి వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.







# రెవెన్యూ, పోలీస్ మా చేతుల్లోనే ఉన్నారు.. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ మొరం మాఫియా దౌర్జన్యం..!

- **కిష్టాపూర్‌లో విచ్చలవిడిగా అక్రమ మొరం తవ్వకాలు**
- **అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్థుల ఆగ్రహం**

**బీర్కూర్, జూలై 13 (డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే మొరం అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని గ్రామస్థులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. రాత్రింబవళ్లు భారీ యంత్రాలతో మొరం తవ్వి ట్రాక్టర్లు, డంపర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ సాగుతున్న ఈ అక్రమ వ్యవహారం వల్ల ప్రభుత్వానికి లక్షల రూపాయల ఆదాయ నష్టం వాటిల్లడమే కాకుండా గ్రామంలోని రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్థుల కథనం ప్రకారం, అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారు ఎలాంటి భయం లేకుండా బహిరంగంగానే వ్యవహరిస్తున్నారు. వారిని ప్రశ్నించిన గ్రామస్థులను రెవెన్యూ, పోలీస్ మా చేతుల్లోనే ఉన్నారు... ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ బెదిరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఈ వ్యాఖ్యలు స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయని, అక్రమ తవ్వకాల వెనుక కొందరు ప్రభావశీలుల అండదండలు ఉన్నాయనే అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్థులు పలుమార్లు సంబంధిత అధికారులకు, రెవెన్యూ శాఖకు, పోలీసులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ఫలితం కనిపించలేదని తెలిపారు. ఫిర్యాదుల అనంతరం కూడా యథావిధిగా మొరం తరలింపు కొనసాగుతుండటంతో అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

అక్రమ మొరం తవ్వకాల వల్ల గ్రామంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయని, భారీ వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము, ధూళి విపరీతంగా ఎగసిపడుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు, మహిళలు రహదారులపై ప్రయాణించేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో రహదారులు మరింత దెబ్బతిని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఈ విషయమై బీర్కూర్ తహసీల్దార్‌ను సంప్రదించగా,కిష్టాపూర్ గ్రామంలో మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు శాఖలతో కలిసి విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.అయితే గ్రామస్థులు మాత్రం మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అక్రమ తవ్వకాల్లో ఉపయోగిస్తున్న జేసీబీలు, ట్రాక్టర్లు, డంపర్లను స్వాధీనం చేసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రభుత్వ భూములు, సహజ వనరులను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.కిష్టాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఈ అక్రమ మొరం తవ్వకాలపై జిల్లా కలెక్టర్, గనుల శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ మరియు పోలీసు అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న ఇటువంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టకపోతే భవిష్యత్తులో మరింత విస్తరించే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

# పార్టీ బలోపేతానికి మండల కమిటీలు ఏర్పాటు

- **ములుగు జిల్లా అధ్యక్షుడు దిలీప్ కుమార్ ముదిరాజ్**

**డీ డీ 9వార్త, ములుగు**




తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో భువనగిరిలో నిర్వహించిన రాజ్యాధికార సమరభేరి సభ విజయవంతం కావడంలో రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సోదర సోదరీమణులకు , అలాగే ములుగు జిల్లా నుంచి పెద్ద ఎత్తున సభకు హాజరైన ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మరియు నా వెంట నడిచిన ప్రతి ఒక్కరికీ ములుగు జిల్లా అధ్యక్షుడిగా నేను తవిటి దిలిప్ కుమార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా పార్టీ బలోపేతమే లక్ష్యంగా వాజేడు మండల కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, కొన్ని గ్రామపంచాయతీలకు పార్టీ అధ్యక్షులను నియమించడం జరిగింది. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాం. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న ,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తురక వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కోరే రవి, జిల్లా ఉపాధ్యక్షురాలు మొగులపల్లి వినోద, రాష్ట్ర కార్యదర్శి గట్ల రాజన్న, విద్యార్థి విభాగ నాయకుడు గట్ల వినీత్ పాల్గొని నూతనంగా నియమితులైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

- **నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట టీడబ్ల్యూజేఎఫ్ నిరసన**

**నిజామాబాద్ జిల్లా జూలై 13(డీడీ9 వార్త) :**

తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు, అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డుల జారీ మరియు జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాజ హితం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల జీవితాల్లో ఎలాంటి మార్పు రావడం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని ఫెడరేషన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల సవరణ పేరుతో జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్నారని, కనీసం వృత్తి నిర్వహణకు అవసరమైన అక్రిడిటేషన్ కార్డుల జారీలోనూ జాప్యం జరుగుతోందని వారు విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు జిల్లా, మండల కేంద్రాల్లో విలేకరులకు యుద్ధప్రాతిపదికన ఇండ్ల స్థలాలు కేటాయించాలని, అక్రిడిటేషన్ కమిటీల్లో అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చేసి కంట్రిబ్యూషన్ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని కోరారు. అలాగే, జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని మరియు రైల్వే పాసుల పునరుద్ధరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. నిరసన అనంతరం జర్నలిస్టుల ప్రతినిధి బృందం జిల్లా అడిషనల్ కలెక్టర్ భుజంగరావును కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, జిల్లా కార్యదర్శి రాంచందర్, జిల్లా నాయకులు మధు, అనిత, ప్రవీణ్, అఖిల్, రాజు, కృష్ణ, రాజేందర్, శ్రీకాంత్ గౌడ్, సురేష్, లక్ష్మణ్, ఆనంద్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.





# సింగరేణిలో సమ్మె నోటీసు.. కార్మిక సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ డిమాండ్

- **ఓసిపి-2లో ఏఐటీయూసీ గేట్ మీటింగ్**
- **కొత్త గనులు, వేజ్ బోర్డు, స్వంత ఇంటి పథకంపై ప్రధాన డిమాండ్లు**
- **పనిముట్లు, సేఫ్టీ పరికరాలు వెంటనే అందించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 12 (డీడీ9 వార్త):**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. సోమవారం ఉదయం ఓసిపి2లో పిట్ సెక్రటరీలు ఎం. సురేష్, ఎ. పోచయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోరిమీ రాజ్‌కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి. రావు, వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, వేజ్ బోర్డుకు అడ్డుగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.54 వేల కోట్ల బకాయిల విడుదల, మారుపేర్ల సమస్య పరిష్కారం, స్వంత ఇంటి పథకం అమలు, గనులకు అవసరమైన స్పేర్ పార్ట్స్, పనిముట్లు, సేఫ్టీ పరికరాలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎల్పీ పిట్ సెక్రటరీ గంగాధర్, జీఎం చర్చల కమిటీ ప్రతినిధులు, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, సేఫ్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి అధికారుల సమస్యలపై త్వరలో నిర్ణయం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- **వేతన సవరణ, పీఆర్‌పీ అమలుపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సూచన**
- **అధికార సంఘం నాయకులతో సింగరేణి యాజమాన్యం చర్చించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశం**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 13 (డీడీ9 వార్త):**



సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 2,200 మంది అధికారుల సమస్యల పరిష్కారంపై త్వరలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. వేతన సవరణ, పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పేమెంట్ పిఆర్పి అమలుపై అధికార సంఘం విజ్ఞప్తులను ప్రాధాన్యంగా పరిగణించి, రానున్న రెండు నుంచి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్ గౌతమ్ పోట్రుకు సూచించారు. అధికార సంఘం నాయకులు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, పెద్ది నరసింహులు ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# సింగరేణి అద్దె వాహనాల డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- ఏఐటీయూసీ డిమాండ్
- టెండర్ ప్రకారం పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్
- పీఎఫ్ పేరుతో అక్రమ కోతలు, కార్మిక హక్కుల ఉల్లంఘనపై ఆగ్రహం
- సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరిక



**పెద్దపల్లి బ్యూరో, జూలై 13 (డీడీ9 వార్త):**

సింగరేణి ఆర్జీ1 ఏరియాలో అద్దె వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆర్జీ1 అధ్యక్షుడు ఎం.ఏ. గౌస్ డిమాండ్ చేశారు.

సోమవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన అద్దె వాహనాల డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డ్రైవర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా, పీఎఫ్ పేరుతో అక్రమంగా వేతనాల్లో కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం వాహన యజమానులకు వత్తాసు పలుకుతూ డ్రైవర్ల శ్రమ దోపిడీకి సహకరిస్తోందని విమర్శించారు.

టెండర్ నిబంధనల ప్రకారం 12 గంటల విధులకు రూ.34 వేల, 8 గంటల విధులకు రూ.23 వేల వేతనం చెల్లించాల్సి ఉండగా, యజమానులు వరుసగా రూ.18 వేల, రూ.15 వేల మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. అదనంగా 12 గంటల డ్రైవర్ల నుంచి రూ.4 వేల, 8 గంటల డ్రైవర్ల నుంచి రూ.3 వేల చొప్పున సీఎంపీఎఫ్ పేరుతో అక్రమంగా రికవరీ చేస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్లకు బోనస్, వేతనంతో కూడిన సెలవులు, యూనిఫాం, హెల్మెట్, షూస్, ఈఎస్ఐ కార్డులు, ప్రమాద బీమా వంటి చట్టబద్ధ సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. డ్రైవర్ల పేరుతో యాజమాన్యం నుంచి చెల్లించే ఓవర్‌టైమ్ చెల్లింపులను వాహన యజమానులు అక్రమంగా స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై ఇప్పటికే సింగరేణి యాజమాన్యానికి లేఖ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. టెండర్ ప్రకారం పూర్తి వేతనాలు చెల్లించడం, అక్రమ పీఎఫ్ కోతలు నిలిపివేయడం, బోనస్, ఈఎస్ఐ, ప్రమాద బీమా తదితర సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డ్రైవర్లతో కలిసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



# విద్యార్థులకు నులి పురుగుల మందుల పంపిణీ

- 48వ డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి చేతుల మీదుగా కార్యక్రమం
- చంద్రబాబు కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ
- పిల్లలు ఆరోగ్య పరిరక్షణతోనే ఉన్నత విద్యలో రాణించే అవకాశం: కార్పొరేటర్

**పెద్దపల్లి బ్యూరో, జూలై 13 (డీడీ9 వార్త):**

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 48వ డివిజన్ పరిధిలోని చంద్రబాబు కాలనీ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నులి పురుగుల నివారణ (ఆల్బెండజోల్) మాత్రలను పంపిణీ చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 48వ డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన పిల్లలే చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి విద్యార్థి నులి పురుగుల నివారణ మాత్రలు తీసుకోవడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చని, తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్టాఫ్ నర్స్ సోనీ, డాక్టర్ స్నేహలత, ఏఎన్ఎం పద్మ, ఆయా సావిత్రి, పాఠశాల చైర్‌పర్సన్ అంజలి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, స్వప్న, రవళి, ఆరోగ్య శాఖ సిబ్బంది, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బాయి బాట కార్యక్రమంలో భాగంగా ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్

- కార్మికుల సొంతింటి కల నెరవేరుస్తాం: ఐఎన్‌టీయూసీ నాయకులు
- పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రద్దుకు కృషి చేస్తామని హామీ

**పెద్దపల్లి బ్యూరో, జూలై 13 (డీడీ9 వార్త):**

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు చేపట్టిన 'బాయి బాట' కార్యక్రమంలో భాగంగా సోమవారం జీడీకే సీహెచ్‌పీ 1లో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు.

ఈ సమావేశానికి ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి. ధర్మపురి, నాయకులు వడ్డేపల్లి దాస్, కె. సదానందం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆర్జీ1 ఉపాధ్యక్షుల ఆధ్వర్యంలో పోరండ్ల మురళి అధ్యక్షతన కార్మికులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జనక్ ప్రసాద్ అండదండలతో కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తామని, కార్మికుల పెర్క్స్‌పై విధిస్తున్న ఆదాయపు పన్ను రద్దు కోసం కృషి చేస్తామని తెలిపారు. అలాగే పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు టైసన్ శ్రీనివాస్, గడ్డం కృష్ణ, మంద రమేష్, బేబీ శీను, పుట్ట రమేష్, మల్లికార్జున్, ఏ.ఎన్. సాగర్, పార్టీ రాజయ్య, గడ్డం వెంకటేశ్వర్లు, బ్రాంచ్ కార్యదర్శులు గుండేటి శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, కూషనపల్లి శంకర్, బూర జగన్, పిట్ కార్యదర్శులు రాజు, సదానందం, ఆంజనేయులు, ఏ. కుమారస్వామి, శ్రీనివాస్, సివిల్ శ్రీనివాస్, చంద్రారెడ్డి, బొల్లి సమ్మయ్య, బి. సాయి, పెద్దిరాజు, ప్రవీణ్, నరేష్, రవి, లచ్చయ్య, శ్రీనివాస్ తదితర నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.





# 15 నుంచి ఐబీ కాలనీ పెద్దమ్మ తల్లి బోనాల జాతర

- భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ పిలుపు
- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని నిర్వాహకుల హామీ

**పెద్దపల్లి బ్యూరో, జూలై 13 (డీడీ9 వార్త):**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఐబీ కాలనీలో వెలసిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి ఆషాఢ బోనాల జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది.

సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ గుర్రాల చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రావుల స్వరాజ్ మాట్లాడుతూ, పెద్దమ్మతల్లి ఆలయం & నాగదేవత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల రోజులపాటు జరిగే ఈ బోనాల ఉత్సవాల్లో ముదిరాజ్ కులస్తులు, బంధువులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ నాయకులు అప్పరాజు ప్రభాకర్, బర్ల మల్లయ్య, ఇస్త్రారి, శీలం శ్రీనివాస్, చిగురు సాయి, చొప్పరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు పనిముట్లు లేవు.. నజరానాలకు నిధులా!!

- ఏఐటీయూసీ ఆగ్రహం
- డ్రిల్ బిట్స్, రక్షణ పరికరాల సరఫరాలో సింగరేణి యాజమాన్యం వైఫల్యమని విమర్శ
- సంస్థ నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు మళ్లించడం ఆపాలని డిమాండ్
- రాజకీయ జోక్యం నిలిపివేసి కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన



**పెద్దపల్లి బ్యూరో, జూలై 13 (డీడీ9 వార్త):**

సింగరేణిలో కార్మికులకు అవసరమైన కనీస పనిముట్లు, రక్షణ పరికరాలను కూడా సరఫరా చేయడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ ఆర్జీ1 బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను విమర్శించారు.

ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత రెండు నెలలుగా డ్రిల్ బిట్స్, డ్రిల్ రాడ్స్, కీలలు, పట్టీలు, గిర్మిట్లు, స్మాల్ మ్యాన్ క్లిప్స్, రెజిన్ క్యాప్సూల్స్, బూట్లు, హెల్మెట్లు, గ్లౌజులు, ఎస్‌డీఎల్ పరికరాలు, టెక్నీషియన్లకు అవసరమైన ఆధునిక పనిముట్లు వంటి సామగ్రి సరఫరా కావడం లేదని ఆరోపించారు. ఒకవైపు కార్మికులకు అవసరమైన సామగ్రి అందించలేని యాజమాన్యం, మరోవైపు ఎవరో తెలియని వ్యక్తులకు ఐఏఎస్‌ల పేరుతో లక్షల రూపాయల నజరానాలు ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. సింగరేణి సంస్థ నిధులను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు, ఇతర పథకాల కోసం వినియోగించడం తగదని అన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితిని మరింత దెబ్బతీసేలా ప్రభుత్వ జోక్యం పెరుగుతోందని ఆరోపించిన ఆయన, వెంటనే కార్మికులకు అవసరమైన పనిముట్లు, రక్షణ పరికరాలు సరఫరా చేయాలని, నజరానాల పేరుతో జరుగుతున్న వ్యయాలను నిలిపివేయాలని, సింగరేణి వ్యవహారాల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. సింగరేణి అభివృద్ధికి కార్మికులే వెన్నెముక అని పేర్కొన్న రంగు శ్రీను, కార్మికులు అప్రమత్తంగా ఉండి తమ హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ చేపట్టే ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలి

- కాకులమర్రి లక్ష్మణ్ బాబు

**మంగపేట జూలై 13డీడీ వార్త**

ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మండల, గ్రామ శాఖల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) చురుకుగా పాల్గొనాలని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పిలుపునిచ్చారు.



ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్ఏలు, బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

ఓటరు జాబితాలో పేర్లు తొలగింపుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేయించి, కొత్తగా అర్హత పొందిన యువత పేర్లను నమోదు చేయించాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి బీఆర్ఎస్ నాయకుడు, కార్యకర్త తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు.

"ప్రతి ఓటు విలువైనది. ప్రతి అర్హుడైన ఓటరిని గుర్తించి నమోదు చేయడం మనందరి బాధ్యత. బీఎల్ఏ-బీఎల్‌వో సమన్వయంతో ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించవచ్చు. ప్రతి ఇంటికి చేరుకుని అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయడమే మన లక్ష్యం" అని కాకులమర్రి లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు.

ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు అందరూ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కొలువులకై కొట్లాడుదాం.. కదలిరండి!

- జూలై 15 మహాధర్నాకు డీవైఎఫ్ఐ పిలుపు
- ఉద్యోగ హామీలు వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్
- జాబ్ క్యాలెండర్ విడుదలలో జాప్యంపై మండిపాటు
- పెద్దపల్లి జిల్లా నిరుద్యోగులు భారీగా తరలిరావాలని పిలుపు

**పెద్దపల్లి బ్యూరో, జూలై 13 (డీడీ9 వార్త):**

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్ ఇంద్రాపార్క్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాధర్నాకు డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పెద్దపల్లి జిల్లా నిరుద్యోగ యువత భారీ సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ పిలుపునిచ్చారు.

సోమవారం గోదావరిఖని పవర్ హౌస్ కాలనీలోని గ్రంథాలయంలో మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం నిరుద్యోగ యువతను మోసం చేయడమేనని విమర్శించారు.

అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జాబ్ క్యాలెండర్ విడుదల చేసి వెంటనే నోటిఫికేషన్లు జారీ చేస్తామని ప్రకటించినప్పటికీ, ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని అన్నారు. అధికారంలోకి వస్తే ఏటా రెండు లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. పోలీసు శాఖలో 20 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమన్నారు. హక్కుల సాధన కోసం యువత ఐక్యంగా పోరాడాలని, జూలై 15న జరిగే మహాధర్నాలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ గోదావరిఖని పట్టణ కమిటీ నాయకులు సూర్య, రాజు, గణేష్, రాజేష్, రవి, మహేందర్, దుర్గ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# నులిపురుగుల నిర్మూలన తోనే బాలల ఆరోగ్యం....

- పిల్లల్లో నులిపురుగుల వ్యాప్తిని నిరోధించడానికి తల్లిదండ్రులు సహకరించాలి

**కన్నాయిగూడెం జూలై 13 :(డిడి9 వార్త)**

కన్నాయిగూడెం ప్రాథమిక ఆరోగ్య పరిధిలో క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సోమవారం రోజున జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం భాగంలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు అన్ని పాఠశాలలలో,అంగన్వాడి కేంద్రాలలో ఆల్బెండజోల్ టాబ్లెట్లు వేయడం జరిగింది ఇందులో డాక్టర్ స్నేహ రెడ్డి మాట్లాడుతూ చేతుల శుభ్రత వల్ల అనేక వ్యాధులను నివారించవచ్చుని, భోజనానికి ముందు మూత్రశాలకు వెళ్ళిన తర్వాత తప్పక చేతులు సబ్బుతో కడుక్కోవాలని, మంచి అలవాట్లవల్ల ఆరోగ్యంగా మంచిగ వుంటామని, పిల్లలు మట్టిలో ఆడుకోవడం వల్ల నులిపురుగుల గుడ్లు చేతుల ద్వారా కడుపులోకి చేరి అక్కడ నులి పురుగులు ఏర్పడి తినే ఆహారంతో నేరుగా నులిపురుగులను చేరడం వల్ల పిల్లల్లో బలహీనత, రక్తహీనత, పోషకాహారలోపం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అవుతాయి కాబట్టి అల్బెండజోల్ టాబ్లెట్ వల్ల పిల్లల్లో శారీరక శక్తి , మానసిక అభివృద్ధి పెరుగుతుంది, ఆట,పాట, చదువుల్లో చురుగ్గా వుంటారు కాబట్టి తప్పక అల్బెండజోల్ టాబ్లెట్ 19 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్,హెల్త్ అసిస్టెంట్స్ లక్ష్మణ్,భాస్కర్,కవిత,సబిత,లక్ష్మి,ఊర్మిళ,పుణ్యవతి,సమ్మక్క,ఆశాలు వర్కర్లు పాల్గొన్నారు



# మంగపేట తహసీల్దార్ కార్యాలయంలో పరిపాలన కుప్పకూలింది

- తక్షణమే డిప్యూటీ తహసీల్దార్ ను నియమించాలి
- ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ&ఆదివాసీసేన మండల అధ్యక్షులు పోలేబోయిన ఆదినారాయణ



**మంగపేట,జులై 13డీడీ9 వార్త**

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మంగపేట మండల ప్రజల పనులు రోడ్డున పడ్డాయని ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ మండల అధ్యక్షులు పోలేబోయిన ఆదినారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పోస్టు ఖాళీ అయి 3 నెలలు గడుస్తోంది. ఒక్కరే ఇద్దరి బాధ్యతలు మోయాల్సి రావడంతో తహసీల్దార్ పై పనిభారం విపరీతంగా పెరిగింది దీంతో సాధారణ ప్రజలకు, రైతులకు, ఆదివాసీలకు కావాల్సిన ఇన్కం, కుల, నివాస, పట్టా, రెవెన్యూ సర్టిఫికెట్లు సకాలంలో అందడం లేదు. ప్రజలు గంటల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పని కావడం లేదు. ఆదివాసీ ప్రాంతమైన మంగపేటను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. కీలకమైన పోస్టు ఖాళీని 3 నెలలుగా భర్తీ చేయకపోవడం ప్రజా వ్యతిరేక చర్య. ఇది ప్రజలను ఇబ్బంది పెట్టడమే. జేఏసీ డిమాండ్ జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి మంగపేట తహసీల్దార్ కార్యాలయానికి డిప్యూటీ తహసీల్దార్ ను తక్షణమే నియమించాలి. ప్రజలకు సకాలంలో రెవెన్యూ సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత. ఈ నిర్లక్ష్యాన్ని ఇక సహించేది లేదు. ఒక వారం లోపు నియామకం చేయకపోతే ఆదివాసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆదినారాయణ హెచ్చరించారు. ఆదివాసీల పనులు ఆపే అధికారం ఎవరికీ లేదు. అని జేఏసీ స్పష్టం చేసింది.ఈ కార్యక్రమం లో మంగపేట మండలం జేఏసీ నాయకులు అన్నెబోయిన సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

# మృతిని కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన బి జె పి నాయకులు

**కన్నాయిగూడెం, జూలై 13 : (డిడి9 వార్త)**

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఏటూరు గ్రామానికి చెందిన శ్రీరాముల మల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని కన్నాయిగూడెం భారతీయ సమాజ్ పార్టీ నాయకుడు మాజీ ఎంపీపీ, మాజీ రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు పల్ల బుచ్చయ్య పరామర్శించారు. మల్లయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, శ్రీరాముల మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం రూ.7,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బి జె పి మండల అధ్యక్షురాలు దుర్గం సమ్మక్క, బిజెపి మండల మహిళా అధ్యక్షురాలు సంగీత,మండల ఉపాధ్యక్షులు బొగ్గుల భాస్కర్,గడ్డం శ్రీనివాస్,కుందరపు సంతోష్, మంచాల భద్రయ్య,మండల భిక్షపతి,గడ్డం విష్ణు వివిధ నాయకులు పాల్గొన్నారు.



# విద్యుత్ ఘాతంతో గేదె మృతి

- బాధిత రైతుకు భరోసానిచ్చిన విద్యుత్ శాఖ అధికారులు

**మంగపేట, జులై 13డీడీ9 వార్త**

మంగపేట మండలంలోని చెరుపల్లి గ్రామంలో సోమవారం ఉదయం త్రీఫేస్ కరెంటు సరఫరా అవుతున్న సమయంలో, ప్రమాదవశాత్తు రైతు బరపటి నరసింహారావుకు చెందిన గేదె విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు అత్యంత వేగంగా, సానుకూలంగా స్పందించి బాధిత రైతుకు అండగా నిలిచారు.

**అధికారుల వేగవంతమైన చర్యలు**

ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ, సిబ్బందితో కలిసి యుద్ధప్రాతిపదికన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని స్వయంగా పరిశీలించి, రైతు నరసింహారావుకు జరిగిన నష్టాన్ని గుర్తించారు. అధికారులు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

**రైతుకు అండగా విద్యుత్ శాఖ**

బాధిత రైతు నరసింహారావు ఆవేదనను అర్థం చేసుకున్న ఏఈ, ఆయనకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. "రైతుకు జరిగిన నష్టం పట్ల మేము బాధ్యతగా ఉన్నాము. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం త్వరగా అందేలా మా శాఖ తరపున పూర్తి కృషి చేస్తాము" అని ఆయన రైతుకు హామీ ఇచ్చారు. ఏఈ యొక్క ఈ సానుకూల వైఖరి పట్ల రైతు నరసింహారావు కృతజ్ఞతలు తెలియజేశారు.

**ప్రశంసనీయమైన బాధ్యత**

సమస్య తెలియగానే ఆలస్యం చేయకుండా క్షేత్రస్థాయికి వచ్చి, రైతుకు ధైర్యం చెప్పిన విద్యుత్ శాఖ అధికారుల పనితీరును స్థానికులు అభినందిస్తున్నారు. అధికారులు చూపిన ఈ చొరవ వల్ల రైతుకు ఆర్థికంగా భరోసా లభించిందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఏ ఈ వెల్లడించారు.



# పోడు రైతులపై ఫారెస్ట్ వేధింపులు ఆపాలి

- పోడు భూములకు పట్టాలివ్వండి.. ఐటీడీఏ పీఓకు వినతి
- పోడు సాగుదారులకు న్యాయం చేయాలి: గుమ్మడి నరసయ్య
- పోడు భూముల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం -- కేచ్చల రంగారెడ్డి

**భద్రాచలం, జూలై 13 (డిడి9 వార్త)**

రాష్ట్ర ప్రభుత్వం పోడు సాగుదారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, అర్హులైన రైతులందరికీ భూ పట్టాలు మంజూరు చేయాలని, పోడు భూముల్లో సాగు చేస్తున్న రైతులపై అటవీ శాఖ అధికారులు చేపడుతున్న దాడులు, అక్రమ కేసులను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ, అఖిలభారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం సమర్పించాయి.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా గిరిజనులు, ఆదివాసీలు, ఇతర పేదలు సాగు చేస్తున్న పోడు భూములకు ఇప్పటికీ పట్టాలు మంజూరు కాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని అటవీ శాఖ అధికారులు సాగుదారులను భూముల నుంచి బలవంతంగా వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, దుమ్ముగూడెం తదితర మండలాల్లో ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న భూముల్లో ప్లాంటేషన్ పేరుతో రైతులను ఖాళీ చేయిస్తున్నారని, పలుచోట్ల సర్వేల పేరుతో భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఫారెస్ట్ అధికారులను ప్రశ్నించిన రైతులపై అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.



ఎన్నికల సమయంలో పోడు భూములకు పట్టాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను రెండేళ్లు గడిచినా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. పోడు సాగుదారులకు భూ హక్కులు కల్పించి, అటవీ శాఖ వేధింపులకు పూర్తిగా చెక్ పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో జిల్లాలోని పోడు రైతులను ఐక్యం చేసి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద భిక్షం, అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, కెచ్చెల కల్పన, జాటోత్ కృష్ణ, కంగాల కల్లన్న, బానోత్ ధర్మ, నాగేశ్వరరావు, వీరబాబు, రామారావు, లక్ష్మణరావు, ఆజాద్, దాసరి సాయన్న, మునిగేలా శివప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.






# భూమి కోసం గిరిజనుల కదం.. ఐటీడీఏ వద్ద సిపిఐ(ఎం) మహా ధర్నా

- అటవీ హక్కుల చట్టాన్ని తుంగలో తొక్కుతున్న ప్రభుత్వాలు
- పట్టా పొందే వరకు పోరాటం ఆగదు: సిపిఐ(ఎం) నేతలు
- ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేత

**భద్రాచలం, జూలై 13 ( డిడి9 వార్త )**

అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ఆదివాసీల సాగు భూముల పరిరక్షణే లక్ష్యంగా సిపిఐ(ఎం) పోరాటాన్ని ఉధృతం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ స్పష్టం చేశారు. సోమవారం భద్రాచలంలో సిపిఐ(ఎం) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గిరిజనుల సాగు భూముల పరిరక్షణకై భారీ మహా ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ, యూపీ సెంటర్ మీదుగా ఐటీడీఏ కార్యాలయానికి చేరుకుంది. అక్కడ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టిన అనంతరం, ఐటీడీఏ పీవో బి.రాహుల్‌కు వినతిపత్రం అందించారు.

**బీజేపీ బాటలోనే**


**కాంగ్రెస్: మీడియం బాబూరావు**

ఈ సందర్భంగా మాజీ ఎంపీ మీడియం బాబూరావు మాట్లాడుతూ, 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులకు పది ఎకరాల భూమి ఇవ్వాల్సి ఉండగా, కనీసం రెండు ఎకరాలు కూడా దక్కడం లేదని విమర్శించారు. సాగులో ఉన్న నాలుగు ఎకరాల్లో రెండు ఎకరాలు వెనక్కి తీసుకుని మొక్కలు వేస్తామనడం దుర్మార్గమని, బీజేపీ విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని మండిపడ్డారు.

**కేంద్రం నుంచి గట్టి హామీ వచ్చేదాకా**

**వదిలేదే లేదు: మచ్చ వెంకటేశ్వర్లు**

సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గిరిజనుల సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పట్టా ఇచ్చే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. అటవీ అధికారుల వేధింపులు ఆపకపోతే మిలిటెంట్ తరహా ఉద్యమాలకు సిద్ధమని పేర్కొన్నారు. గిరిజనుల భూములకు రైతుబంధు అందించాలని, బోర్లు వేసి విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



**సానుకూలంగా స్పందించిన ఐటీడీఏ పీవో**

నేతల వినతిని స్వీకరించిన ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ, గిరిజనుల సాగు భూముల జోలికి వెళ్లొద్దని ఇప్పటికే అటవీ శాఖ అధికారులను ఆదేశించామని తెలిపారు. సమస్యల పరిష్కారానికి, భూముల అభివృద్ధి పథకాల అమలుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, కొలగాని బ్రహ్మాచారి, రేపాకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# రోడ్డుకోసం రోడ్డెక్కిన కమ్యూనిస్టులు..

- బీఆర్ఎస్ మద్దతుతో ఆలుబాకలో భారీ ధర్నా..
- రెండు గంటల పాటు రహదారిపై నిరసన.. 10 కిలోమీటర్ల మేర వాహనాల నిలిచివేత..
- రోడ్డు పూర్తయ్యే వరకు ఇసుక లారీలను నిలిపివేయాలని డిమాండ్.

**వెంకటాపురం, జూలై 13 (డీడీ9 వార్త):**

వెంకటాపురం మండలంలోని ఆలుబాక గ్రామంలో సోమవారం సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో ధ్వంసమైన చర్ల-వెంకటాపురం రహదారి సమస్యపై భారీ ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి రెండు గంటలకుపైగా ఆందోళన చేపట్టడంతో రహదారికి ఇరువైపులా సుమారు పది కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వెంకటాపురం నుంచి చర్ల వరకు కేవలం 45 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి రెండు నుంచి మూడు గంటల సమయం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా పూర్తిగా ధ్వంసమైన ఈ రహదారిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ మార్గం పూర్తిగా ఇసుక లారీలకు దారాదత్తమైందని, భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్డు మరింత దెబ్బతింటోందని ఆరోపించారు.

వర్షాకాలానికి ముందే రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వర్షాలు ప్రారంభమైనా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. రోడ్డు దుస్థితి కారణంగా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు కూడా గ్రామాలకు చేరుకోలేని పరిస్థితి ఏర్పడిందని, ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. చర్ల నుంచి వెంకటాపురం వరకు వెంటనే నూతన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని, పనులు పూర్తయ్యే వరకు ఇసుక లారీల రాకపోకలను నిలిపివేయాలని, ఎమ్మెల్యేలు, మంత్రులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ధర్నా స్థలానికి రెండు గంటల అనంతరం చేరుకున్న అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ప్రభుత్వం స్పందించకపోతే స్థానిక ప్రజలను భాగస్వామ్యం చేసుకొని మరింత ఉధృతంగా దశలవారీ ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు,సీపీఎం, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# వెంకటాపురం మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం విజయవంతం..

- పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1–19 ఏళ్ల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**జూలై13 డిడి9 వార్త వెంకటాపురం.**

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం వెంకటాపురం మండలంలోని ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ సర్పంచులు, ఉపసర్పంచులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో ప్రారంభించారు. వెంకటాపురం సర్పంచ్, ఉపసర్పంచ్‌లు స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వైద్యాధికారులు విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. "సబ్బుతో చేతులు కడుక్కుందాం - జబ్బులకు దూరంగా ఉందాం" అనే సందేశంతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంవత్సరానికి రెండుసార్లు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందని వివరించారు.

లక్ష్మీనగరం వసతిగృహంతో పాటు చిరుతపల్లి-1, చిరుతపల్లి-2 ప్రాంతాల్లోని విద్యార్థులకు అల్పాహారం లేదా భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.

ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచులు, ఉపసర్పంచులు, విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, వైద్యాధికారులు భాస్కర్, ఆసీస్, హెచ్ఈఓ కోటిరెడ్డి, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేవాదుల ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం.

- **దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత ఉండదు.**
- **22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపుతాం.**
- **దేవాదుల పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తాం.**
- **38.16 టీఎంసీల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగిస్తాం.**
- **భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం.**
- **రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.**
- **ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనే కార్యాచరణ అమలు**
- **గోదావరి జలాలతో రైతాంగానికి పూర్తి భరోసా కల్పిస్తాం.**
- **ప్రాజెక్టు పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగిస్తాం.**
- **పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేశాం.**
- **సాగునీరు, తాగునీటి అవసరాలే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం.**
- **దేవాదుల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తాం.**
- **రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క**

**ములుగు జిల్లా / కన్నాయి గూడెం జూలై 13 (డిడి9 వార్త)**

సోమవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గార్లకు జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటిడిఏ పి.ఓ. లెనిన్ వస్సల్ టోప్పో, డి ఎఫ్ ఓ వికాస్ మీనాలు పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి తుపాకులగూడెం సమ్మక్క సారలమ్మ బ్యారేజీ గోదావరి నది నీటి ప్రవాహాన్ని నీటి నిల్వ పరిస్థితులను పరిశీలించి, తుపాకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని గుట్టల గంగారం జె చొక్కా రావు దేవాదుల ప్రాజెక్టు వాటర్ పాయింట్ ను, మోటార్ల పనితీరును, ఎత్తిపోతల సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించారు.

అనంతరం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవిన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులతో దేవాదుల ప్రాజెక్ట్ పెండింగ్ పనులు, భూ సేకరణ, ఎత్తిపోతల సామర్థ్యం, సాగు త్రాగునీరు, మోటార్ల పనితీరు పై పి పి టి ద్వారా ఇంజనీరింగ్ అధికారులు వివరించగా ఇట్టి అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాదుల ప్రాజెక్టుకు నిధుల కొరత లేకుండా అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, పంపింగ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి 38.16 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగిస్తామని, 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపి దేవాదుల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు రైతులకు గోదావరి జలాలతో శాశ్వత భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

భూసేకరణను వేగవంతంగా పూర్తి చేసి, ప్రాజెక్టు పనుల్లో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించడంతో పాటు పెండింగ్ బిల్లులను ఇప్పటికే విడుదల చేశామని, సాగునీరు-తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, ఎల్‌నినో పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనే కార్యాచరణను కూడా అమలు చేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖల మంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాగునీరు, తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం దూరదృష్టితో కార్యాచరణ చేపట్టిందని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల తెలంగాణ రాష్ట్రంలో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న సందర్భంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రివర్గం తో కలిసి పలు మార్లు విస్తృత స్థాయిలో సమీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంపై ఎలా ఉండబోతోందో, దాని వల్ల వ్యవసాయం, తాగునీటి సరఫరా, జలవనరులపై కలిగే ప్రభావాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై లోతుగా చర్చించి ముందస్తు కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.

గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోవాలని, ఎక్కడెక్కడ నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందో అక్కడ ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఇందుకోసం ఎంత వ్యయంతో కూడుకున్న, విద్యుత్ బిల్లులు ఎంత భారమైనా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా వెనుకాడబోమనే స్పష్టమైన నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుందని పేర్కొన్నారు. గోదావరి జలాలను లిఫ్ట్ చేసి వ్యవసాయ భూములకు సాగునీరు అందించడం, చెరువులను నింపడం, భూగర్భ జలాలను పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాలకు, పట్టణాలకు తాగునీటిని సమృద్ధిగా అందించడం లక్ష్యంగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.



దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్రంలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే అత్యంత కీలక ప్రాజెక్టు అని, ఈ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించి రైతులకు నమ్మకమైన నీటి వనరును అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో తీసుకుంటున్న ఈ చర్యల వల్ల ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటూ, రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించడం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడడం, సాగునీటి వనరులను బలోపేతం చేయడం సాధ్యమవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ఎత్తిపోతల పథకం రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ఇస్తుందని, ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో వినియోగించి రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి, పంపింగ్ వ్యవస్థ, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూసేకరణ, పెండింగ్ పనులు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించి, అధికారులతో కలిసి ప్రాజెక్టు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టులో ఉన్న 10 పంపుల్లో 7 పంపులు పనిచేస్తున్నాయని, మరో ఒకటి రెండు రోజుల్లో అన్ని 10 పంపులను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ములుగు, వరంగల్ చీఫ్ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్లలో వివిధ దశల్లో నీటిని నింపుతున్నామని, ఒక్క రిజర్వాయర్ కూడా ఖాళీగా ఉండకుండా పూర్తి సామర్థ్యంతో నింపడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రాజెక్టు పనులకు సంబంధించి రూ.194 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారని, ఆర్థిక శాఖ మంత్రి సహకారంతో ఆ రూ.194 కోట్ల నిధులను వెంటనే విడుదల చేస్తున్నట్లు సభాముఖంగా ప్రకటించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. అవసరమైన నిధులు ఎంతైనా ప్రభుత్వం సమకూరుస్తుందని, భూసేకరణ కారణంగా ప్రాజెక్టు పనులు ఎక్కడా ఆగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 38.16 టీఎంసీలు అని పేర్కొంటూ, ఆ సామర్థ్యానికి అనుగుణంగా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టు రూపకల్పనలో ఉన్న మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. కొత్త ఆయకట్టు, స్థిరీకరణ ఆయకట్టు రెండింటికీ నీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రాజెక్టు అమలులో ఎక్కడైనా సాంకేతిక లేదా పరిపాలనాపరమైన అడ్డంకులు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చీఫ్ ఇంజనీర్లకు సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం గోదావరి జలాలను అత్యధికంగా వినియోగించి తెలంగాణ చరిత్రలోనే అత్యధిక వ్యవసాయ విస్తీర్ణంలో పంటలు సాగు చేశామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక వరి దిగుబడులు ప్రజా ప్రభుత్వ హయాంలోనే నమోదయ్యాయని చెప్పారు.

యాసంగి సీజన్‌లోనే 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి, వరి కొనుగోళ్ల రూపంలో సుమారు రూ.84 వేల కోట్లకు పైగా చెల్లింపులు చేశామని, యాసంగి పంటకే రూ.19 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తోందని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా సుమారు 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ఇందులో దాదాపు 92 శాతం ఆయకట్టు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉండగా, మిగిలిన భాగం నల్లగొండ జిల్లాలో విస్తరించి ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రాజెక్టును సందర్శించి, ఏడాది వ్యవధిలో పూర్తిచేయాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారని తెలిపారు. ఆ లక్ష్య సాధన కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు.

ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుగా తీసుకుని వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నందుకు ప్రజా ప్రభుత్వానికి ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 6 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ఫేజ్1, ఫేజ్2, ఫేజ్3లలోని 10 మోటార్ల ద్వారా రోజుకు సుమారు 0.25 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉందన్నారు. దేవాదుల ప్రాజెక్టు సమర్థవంతంగా పనిచేయాలంటే నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, పంపుల నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ మధ్య సమన్వయం అత్యంత కీలకమని, ఈ మూడు వ్యవస్థలు సమిష్టిగా పనిచేస్తేనే పంపింగ్ వ్యవస్థ నిరంతరాయంగా కొనసాగి రైతులకు సకాలంలో సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఇంజనీరింగ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం

- **జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ గత్తం బాలరాజు**

**డీ డీ 9 వార్త , బోనకల్ జూలై 13 :**

బోనకల్ మండల పరిధిలోగల చిన్న బీరవెల్లి గ్రామపంచాయతీ నందు కొప్పుల నాగరత్నం భర్త కొప్పుల పెదకాంతయ్య( మాజీ సర్పంచ్) వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 29,500 మంజూరు అయినది వారి అనారోగ్య కారణంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు గ్రామ కాంగ్రెస్ కమిటీ ద్వారా దరఖాస్తు చేసుకొనగా అట్టి పైకం మంజూరైనది అట్టి మంజూరైన చెక్కును గ్రామ కాంగ్రెస్ కమిటీ ఆమెకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గత్తం బాలరాజు, కార్యదర్శి బూసి శివాజీ, సహాయ కార్యదర్శిలు బుద్ధ భూపాల్, ఖమ్మం పాటి యోహాన్, గౌరవ అధ్యక్షుడుచంద్ర వెంకట్రావు, గ్రామ కోశాధికారి మర్సకట్ల సంజీవరావు, వార్డ్ మెంబర్స్ బాణాల రామారావు, గతం పున్నారావు, సభ్యులు సోమ శాంతయ్య, జడ లక్ష్మయ్య, సోమ కాశం మొదలగువారు పాల్గొన్నారు



# ఆ ఉపాధ్యాయుడిపై స్నేహితుల అంతులేని అభిమానం

- **జాతీయస్థాయిలో గుర్తింపు... ల్యాదల్ల రమేష్ ఫిజికల్ డైరెక్టర్ కు ఘన సన్మానం..**
- **ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్**
- **కలాం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సర్వర్ అహ్మద్**
- **తాళ్లపల్లి రాజన్న ఆర్టీవో అనకాపల్లి.**

**ములుగు బ్యూరో, జూలై 13, డీ డీ 9 వార్త**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకుల పాఠశాలలో, కళాశాలలో సుదీర్ఘంగా విశిష్ట సేవలు అందించిన ల్యాదల్ల రమేష్ ఫిసికల్ డైరెక్టర్ పదవి విరమణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రమేష్ తన సుదీర్ఘ సేవా కాలంలో వ్యాయామ విద్యకు విశేష ప్రాధాన్యం కల్పించి, అనేక మంది విద్యార్థులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో క్రీడాకారులను తీర్చిదిద్దారని వారు కొనియాడారు. రమేష్ క్రీడా స్ఫూర్తితో నేర్పిన విద్య అతని శిష్యులు ప్రభుత్వ శాఖలో శిక్షణ పొందిన విద్యార్థులు పోలీస్ ,ఎక్సైజ్ తదితర శాఖలలో ఉద్యోగాలు సాధించి, వారు జీవితంలో స్థిరపడ్డారని తెలిపారు. రమేష్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేడు పదవి విరమణ పొందుతున్న రమేష్ అన్న ప్రజాసేవలో కూడా ఆయన సేవలు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి అతన్ని చిన్నప్పటి స్నేహితులు, పదవ తరగతి 1980 1981 వ సంవత్సరంలో చదివిన స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఈ క్రమంలో తాళ్ల పెల్లి రాజన్న ఆర్టీవో అనకాపల్లి, మహమ్మద్ సర్వర్ అహ్మద్ తెలంగాణ టీచర్స్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షులు, కసిరెడ్డి సురేందర్ రెడ్డి ఏఎస్ఐ వరంగల్, సునీత, రమాదేవి, రవి, భాస్కర్, రాజమౌళి, శంకర్, సదానందం, అశోక్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.




# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి..

- **సింగరేణి పరిరక్షణకు, మణుగూరు మనుగడకు చర్యలు తీసుకోవాలి..**
- **కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కి వినతిపత్రం అందజేసిన IFTU నాయకులు.**

**మణుగూరు.జూలై 13(డి డి 9వార్త)**



భద్రాద్రి జిల్లా,మణుగూరు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐ ఎఫ్ టి యు మణుగూరు ఏరియా ఆధ్వర్యంలో సోమవారం నాడు మణుగూరు విచ్చేసిన కేంద్ర బొగ్గు & గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు మణుగూరు ఏరియా అధ్యక్షులు ఏ. మంగీలాల్ మాట్లాడుతూ, సింగరేణి సంస్థ పరిరక్షణలో భాగంగా తాటిచర్ల గనిని సింగరేణికి కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా మణుగూరు ప్రాంత మనుగడ కోసం PKOC డిప్ సైడ్ గనిని కూడా సింగరేణికి కేటాయించాలని కోరారు.సింగరేణి వ్యాప్తంగా వివిధ గనులు, డిపార్ట్మెంట్లలో సుమారు ముప్పయి రెండు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, ఓ బి వర్కర్లు గా పనిచేస్తున్నారని తెలిపారు. సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకతలో శాశ్వత కార్మికులతో సమానంగా శ్రమిస్తున్నా, "ఆయన గొర్రె తోక బెత్తెడు" అన్న సామెతగా చిరు జీతాలతో జీవితాలు వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొన్ని ప్రధాన డిమాండ్ లను వారు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. హై పవర్ కమిటీ వేతనాలను వెంటనే అమలు చేయాలి
2. సింగరేణి క్యాంటీన్లలో టీ,టిఫిన్,భోజనాలకు కాంట్రాక్ట్ కార్మికులకు బడ్జెట్ కేటాయించాలి.
3. ESI వైద్యాన్ని పూర్తిగా అమలు చేయాలి.
4. విధి నిర్వహణలో ప్రమాదాలతో పాటు, సహజ మరణం, బయట జరిగే ప్రమాదాలకు కూడా ప్రమాద బీమా వర్తింపజేయాలి.

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు, మరియు యూనియన్ నాయకులు పాల్గొన్నారు

# ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్ 2 డిప్ సైడ్ కోల్ బ్లాక్‌ను నేరుగా సింగరేణికి కేటాయించి మణుగూరు మనుగడను రక్షించాలి..

- **కేంద్ర బొగ్గు,మరియు గనులశాఖ మంత్రి జి కిషన్ రెడ్డి కి వినతి పత్రాన్ని అందచేసిన ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రసిడెంట్ నాగెల్లి..**

**మణుగూరు.జూలై 13(డి డి 9వార్త )**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి. నల్ల బంగారాన్ని వెలికితీస్తూ ప్రతి ఏడాది నిర్దేశించిన ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలను అధిగమించేందుకు మణుగూరు ఏరియా కార్మికులు తమ రక్తాన్ని చెమటగా మార్చి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తూ సింగరేణి సంస్థకు గణనీయమైన లాభాలు చేకూరుస్తున్నారని టి.బి. జి.కె.యస్ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు.

మణుగూరు ఏరియా కార్మికుల సేవలను గుర్తించి, భావితరాల ఉపాధి, ఏరియా మనుగడను దృష్టిలో ఉంచుకుని ప్రకాశం ఖని ఓపెన్‌కాస్ట్-2 డిప్ సైడ్ కోల్ బ్లాక్‌ను వేలం నుంచి మినహాయించి నేరుగా సింగరేణి సంస్థకు కేటాయించాలని, అలాగే మణుగూరు ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి నాగెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సింగరేణి భవిష్యత్తు, మణుగూరు ఏరియా మనుగడను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ బిడ్డగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని డిప్ సైడ్ బ్లాక్‌ను నేరుగా సింగరేణికి కేటాయించడంతో పాటు మణుగూరు ఓపెన్‌కాస్ట్ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కోరారు. టి.బి.జి.కె.యస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి దిశానిర్దేశం, స్థానిక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సూచనల మేరకు ఈ వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు.

మణుగూరు డిప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించకపోయినా, మణుగూరు ఓపెన్‌కాస్ట్‌కు అనుమతులు మంజూరు చేయడంలో జాప్యం జరిగినా ఏజెన్సీ ప్రాంతమైన మణుగూరు ఏరియా మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపులో న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పటికీ ప్రత్యేక అధికారాలను వినియోగించి సింగరేణికి కేటాయించిన తరహాలోనే, మణుగూరు డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా నేరుగా సింగరేణికి కేటాయించి, మణుగూరు ఓపెన్‌కాస్ట్‌కు అనుమతులు మంజూరు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించాలని కోరారు. డిప్ సైడ్ బ్లాక్‌లో అత్యంత నాణ్యమైన, అధిక గ్రేడ్ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని, దీనిని సింగరేణికి కేటాయించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి సంస్థకు గణనీయమైన ఆదాయం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగి మణుగూరు ఏరియా అభివృద్ధికి మణిహారంగా నిలుస్తుందని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ సంస్థలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నందున, బొగ్గు రంగం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే అంశం కావడంతో సంస్థ ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ఈ మేరకు ఇటీవల టి.బి. జి.కె.యస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు రాసిన లేఖ ప్రతిని కూడా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి అందజేశారు. అదేవిధంగా సింగరేణి పరిరక్షణ, కార్మిక సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తీసుకున్న నిర్ణయాలు, బాధ్యతాయుత కార్మిక సంఘంగా టి.బి.జి.కె.యస్ సాధించిన హక్కులు, విజయాలను వివరిస్తూ ప్రత్యేక వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, బొద్దుల ప్రవీణ్ కుమార్, జంగం రాజ్ కుమార్, సాంబార్ రాజశేఖర్, గుగులోత్ రమేష్ నాయక్, పద్దం శ్రీనివాస్, బాలాజీ, ధారావత్ కృష్ణ, నిఖిల్, వేముల నవీన్, గొర్రె ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జూన్ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు నామినేషన్లలో శుభ్‌మన్ గిల్

- **జూన్‌లో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్**
- **బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ కూడా రేసులో**
- **పోటీలో ఉన్న న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్**
- **ఆఫ్ఘన్‌తో వన్డే, టెస్టు ఫార్మాట్‌లో అద్భుతంగా రాణించిన గిల్**
- **వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు**

**డిడి9 వార్త:**

జూన్ నెలకు గానూ ఐసీసీ పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నామినేట్ అయ్యాడు. జూన్ నెలలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నట్లు ఐసీసీ సోమవారం ప్రకటించింది.

ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన హోం సిరీస్‌లో గిల్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుతంగా రాణించాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్ విజయానికి కీలకంగా నిలిచాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, లక్నో వన్డేలో కాళ్ల నొప్పితో ఇబ్బంది పడుతూనే 110 బంతుల్లో 154 పరుగులు చేసి భారత్‌కు విజయం అందించాడు. ఆ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి, భారత్ 30తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు.

నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రక 21 వన్డే సిరీస్ విజయం అందించడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు, న్యూజిలాండ్ పేసర్ నాథన్ స్మిత్ ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 16 వికెట్లు పడగొట్టి 21తో సిరీస్ గెలవడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనలతో ఇద్దరూ జూన్ నెల ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్



## వింబుల్డన్ కింగ్‌గా సిన్నర్.. ఫెదరర్, జొకోవిచ్ సరసన అరుదైన రికార్డు

- **వింబుల్డన్ ఛాంపియన్‌గా నిలిచిన జానిక్ సిన్నర్**
- **ఫైనల్‌లో జ్వెరెవ్‌పై నాలుగు సెట్ల పోరాటంలో విజయం**
- **వరుసగా రెండోసారి టైటిల్ నిలబెట్టుకుని ఫెదరర్, జొకోవిచ్ సరసన చేరిన సిన్నర్**
- **కెరీర్‌లో ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకున్న ఇటలీ స్టార్**
- **జ్వెరెవ్‌పై వరుసగా 10వ విజయాన్ని నమోదు చేసిన వరల్డ్ నెం.1**

**డిడి9 వార్త:**

టెన్నిస్ ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నాడు వరల్డ్ నంబర్ 1 జానిక్ సిన్నర్. వింబుల్డన్ 2026 పురుషుల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా రెండోసారి కైవసం చేసుకుని సత్తా చాటాడు. లండన్‌లోని ప్రతిష్ఠాత్మక సెంటర్ కోర్టులో జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్‌పై 67(7), 76(2), 63, 64 తేడాతో విజయం సాధించాడు. దాదాపు 3 గంటల 46 నిమిషాల పాటు సాగిన ఈ హోరాహోరీ పోరులో సిన్నర్ తన నైపుణ్యాన్ని, మానసిక స్థైర్యాన్ని ప్రదర్శించి విజేతగా నిలిచాడు.

మ్యాచ్ ఆరంభంలో జ్వెరెవ్ అద్భుతమైన సర్వీసులతో, పదునైన ఆటతీరుతో సిన్నర్‌కు గట్టి సవాలు విసిరాడు. తొలి సెట్‌ను టైబ్రేక్‌లో గెలుచుకుని ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. రెండో సెట్‌లోనూ అదే పోరాటపటిమ కనబరిచినప్పటికీ, టైబ్రేక్‌లో సిన్నర్ పైచేయి సాధించి స్కోరును సమం చేశాడు. అయితే, మూడో సెట్ మధ్యలో జ్వెరెవ్ కోర్టులో జారిపడటం మ్యాచ్ గతిని మార్చేసింది. ఈ ఘటన తర్వాత సిన్నర్ క్రమంగా పట్టు బిగించి, మ్యాచ్‌ను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. చివరి రెండు సెట్లను సునాయాసంగా గెలిచి టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు.

**సిన్నర్ ఖాతాలో పలు అరుదైన రికార్డులు**

ఈ విజయంతో సిన్నర్ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఓపెన్ శకంలో వరల్డ్ నంబర్ 1 ర్యాంకులో ఉండి వింబుల్డన్ టైటిల్‌ను నిలబెట్టుకున్న నాలుగో ఆటగాడిగా పీట్ సంప్రాస్, రోజర్ ఫెదరర్, నొవాక్ జొకోవిచ్ వంటి దిగ్గజాల సరసన నిలిచాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో అనూహ్యంగా ఓటమిపాలైన తర్వాత సిన్నర్ ఫామ్‌పై తలెత్తిన సందేహాలకు ఈ విజయంతో గట్టి సమాధానం చెప్పాడు. కేవలం 24 ఏళ్ల వయసులోనే ఇది అతనికి ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్ కావడం విశేషం.

అంతేగాక కెరీర్‌లో 30వ ట్రోఫీని సాధించాడు. జ్వెరెవ్‌పై ఇది అతనికి వరుసగా 10వ విజయం. ఈ గెలుపుతో గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో 100వ మ్యాచ్ విజయాన్ని, ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో వరుసగా 14వ గెలుపును నమోదు చేశాడు. గెలుపు అనంతరం సెంటర్ కోర్టు పచ్చికపై పడుకుని ఆకాశం వైపు చూస్తూ సిన్నర్ తన ఆనందాన్ని పంచుకున్న క్షణాలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



# సీతారామ ప్రాజెక్ట్ – మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

**మణుగూరు.జూలై 13(డి డి 9వార్త)**

రైతుల భవిష్యత్తును మార్చే సాగునీటి ప్రాజెక్ట్ - ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వరప్రదాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలంలోని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పరిధిలో నిర్మాణంలో ఉన్న మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతి, కాలువల నిర్మాణం, పంప్ హౌస్‌లు, సాగునీటి పంపిణీ వ్యవస్థ, నాణ్యత ప్రమాణాలు, భూసేకరణ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సాగునీరు సకాలంలో అందించాలంటే పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్ట్, మారెళ్ళపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. గోదావరి జలాలను ఎత్తిపోసి సాగుకు అందించడం ద్వారా వేలాది రైతు కుటుంబాలకు శాశ్వత సాగునీటి భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోందని, పెండింగ్‌లో ఉన్న అనుమతులు, భూసేకరణ, అటవీ అనుమతులు తదితర అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ వల్ల కలిగే ప్రధాన ప్రయోజనాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి సౌకర్యం అందుతుంది.భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల రైతులకు గోదావరి జలాలు అందుబాటులోకి వస్తాయి. వర్షాధార వ్యవసాయం నుంచి స్థిరమైన సాగు వ్యవస్థకు మారే అవకాశం ఏర్పడుతుంది. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరిగి రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. భూగర్భ జలాలపై ఆధారపడే పరిస్థితి తగ్గి బోర్లు, విద్యుత్ వినియోగం తగ్గుతుంది. భవిష్యత్తులో తాగునీటి అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడే అవకాశం ఉంది. సీతమ్మసాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టుతో అనుసంధానమై సుమారు 6.7 లక్షల ఎకరాలకు పైగా సాగునీరు, జలవిద్యుత్ ఉత్పత్తి వంటి ప్రయోజనాలు కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు కొనసాగిస్తోంది. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం. సీతారామ ప్రాజెక్ట్ పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ రంగంలో స్వర్ణయుగానికి నాంది పలుకుతుంది. ప్రతి రైతు పొలానికి గోదావరి జలాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ (CE) శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ (SE) మహేశ్వర్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (EE) తెల్లం వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (DE) వై. రాంబాబు, శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్లు (AE) సందీప్, రమేష్, వెంకటేష్ తదితర ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

- **జి.ఓ. 111 ఉల్లంఘించి నాలా పై నిర్మిస్తున్నది శ్రీ రామ్ అకాడమీ పాఠశాలను**
- **మేకల గడ్డ లోని భారీ షెడ్డు,10 కాటేజెలు,మిర్చి డెవలపర్స్ నిర్మిస్తున్న ఐదు విల్లాల అక్రమ నిర్మాణాలను తొలగించాలని వినతి**
- **సీఎంసీకి ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడంతో కలెక్టర్‌ను పిర్యాదు**
- **ప్రజావాణి ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**



**హైదరాబాద్, డీడీ9 వార్త:**


నార్సింగి సర్కిల్ పరిధిలో జి.ఓ. 111 నిబంధనలను ఉల్లంఘిస్తూ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, వాటిని తొలగించాలని కోరుతూ డీడీ9 వార్త ప్రతినిధి తోట అంజనేయులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇదే అంశంపై గతంలో జూలై 6 న సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ సృజనకు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి ప్రభావవంతమైన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆరోపించారు.

ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, నార్సింగి సర్కిల్ 45 పరిధిలోని గౌలిదొడ్డి గ్రామంలో ది శ్రీరామ్ అకాడమీ పాఠశాల నిర్మాణాలు చంద్రకుంట చెరువు పరిధిని ఆక్రమించి సుమారు 30 వేల చదరపు గజాల్లో కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఈ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే వెంటనే కూల్చివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

అదేవిధంగా జనవాడ మేకలగడ్డ గ్రామంలో ఫియాస్టా ఎదురుగా జి.ఓ.111 పరిధిలో నిర్మిస్తున్న 10 కాటేజీలు, ఫియాస్టా దాటిన తర్వాత నిర్మాణంలో ఉన్న భారీ షెడ్, జనవాడ-శంకర్‌పల్లి రహదారిలో రోస్ట్ క్రంచ్ కేఫ్ సమీపంలో నిర్మిస్తున్న భారీ దాబా, మోకిల పోలీస్ స్టేషన్ సమీపంలోని ఫంక్షన్ హాల్, అలాగే కేఫ్ జో సమీపంలో సిల్వర్ వుడ్ వెనుక నాలాను ఆక్రమించి నిర్మిస్తున్న షెడ్లపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

జంట నగరాలకు తాగునీటిని అందించే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల క్యాచ్‌మెంట్ ప్రాంతాలను పరిరక్షించడానికే జి.ఓ.111 అమల్లోకి తీసుకువచ్చారని, అలాంటి ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగితే పర్యావరణానికి, ప్రభుత్వ భూములకు, ప్రజా ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు సంబంధిత అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, బఫర్ జోన్‌లను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకొని, ఈ ఫిర్యాదుపై తీసుకున్న చర్యల నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.



13/7/2026
Date: 13-07-2026
Place: Hyderabad

To
The District Collector
Ranga Reddy District,
Telangana.

ZC. Serilingampalli
Enquire & Take n/a
13/7

Subject:

Request for a comprehensive inquiry into the alleged illegal constructions in violation of G.O. Ms. No. 111 within Narsingi Circle, and for the removal of unauthorized structures and protection of government lands, lakes, nalas, and buffer zones.

Respected Sir,

I respectfully submit that on 06-07-2026, I lodged a complaint through the Prajavani Grievance Redressal System before the Commissioner of the Cyberabad Municipal Corporation (CMC), Smt. Srujana, regarding several alleged illegal constructions being carried out in violation of G.O. Ms. No. 111 within the jurisdiction of Narsingi Circle.

However, despite the submission of my complaint, no effective action has been taken so far, and the alleged unauthorized constructions continue without interruption.

Therefore, I request your kind intervention and immediate action in the matter.

The issues raised in my complaint are as follows:

1. The Sriram Academy, located at Gowlidoddi Village under Narsingi Circle-45, is allegedly carrying out construction over approximately 30,000 square yards by encroaching upon Chandrakunta Lake. I request that a detailed inquiry be conducted and, if violations are established, appropriate legal action be initiated, including demolition of the unauthorized structures.
2. At Mekalagadda Village, Janwada, opposite Fiesta, approximately 10 cottages are allegedly being constructed within the G.O. 111 area. In addition, a large shed is under construction beyond the Fiesta premises. Necessary action may kindly be taken after verification.
3. On the Janwada–Shankarpally Road, near Roast Crunch Café, adjacent to Silver Restreet, a large shed (Dhaba) is allegedly under construction. Further, near Mokila Police Station, a large function hall is reportedly under construction. These constructions may kindly be inspected for compliance with G.O. Ms. No. 111 and other applicable laws.
4. Near Café Zo, behind Silver Wood, sheds are allegedly being constructed by encroaching upon a nala (drain). Necessary action may kindly be taken after due verification.

The primary objective of G.O. Ms. No. 111 is to protect the catchment areas of Osman Sagar and Himayat Sagar, which are the principal sources of drinking water for the twin cities of Hyderabad and Secunderabad. Any unauthorized construction in these protected areas, if established, may cause serious damage to the environment, government lands, and public interest.

In view of the above, I humbly request your office to:



**జి.ఓ.111 ఉల్లంఘనలపై క్షేత్రస్థాయి విచారణకు ఆదేశం**

నార్సింగి సర్కిల్ పరిధిలో జి.ఓ.111 నిబంధనలను ఉల్లంఘిస్తూ జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై డీడీ9 వార్త ప్రతినిధి తోట అంజనేయులు ప్రజావాణిలో సమర్పించిన ఫిర్యాదుపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి స్పందించారు.

ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్, వెంటనే విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న గౌలిదొడ్డి గ్రామంలోని ది శ్రీరామ్ అకాడమీ నిర్మాణాలు, మేకలగడ్డలోని కాటేజీలు, భారీ షెడ్లు, జనవాడ-శంకర్‌పల్లి రహదారిలోని ఇతర నిర్మాణాలపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, నిబంధనల ఉల్లంఘనలు ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అధికారిక పత్రంలో పేర్కొన్నారు. ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో, జి.ఓ.111 పరిధిలో జరుగుతున్న నిర్మాణాలపై త్వరలోనే చర్యలు ఉంటాయనే ఆశాభావం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.